
తెలుగు దినపత్రిక
https://aksharagalam.com
# అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం
పేజీలు: 8 | వెల: 3 | సంపుటి:3 | సంచిక: 232
బుధవారం 28, జనవరి 2026
॥ ఎడిటర్: దయాకర్ రెడ్డి ॥

## పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

- అఖిలపక్షం నిర్వహించిన కేంద్రం
- వివరాలు వెల్లడించిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు



న్యూఢిల్లీ,జనవరి27(అక్షరగళం): బడ్జెట్ సమావేశాల్లో అన్ని విషయాలపై చర్చకు ప్రభుత్వం సిద్దంగా ఉందని అఖిలపక్ష భేటీలో కేంద్రం స్పష్టం చేసింది. అయితే చర్చకు అనుసరించాల్సిన తీరులో ముందుకు రావాలని కూడా సూచించింది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన మంగళవారం అఖిలపక్షభేటీ జరిగింది. సమావేశానంతనం వివరలాను పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మీడియాకు వెల్లడించారు. అయితే 'వీబీ జీ రామ్ జీ' చట్టంపై చర్చ జరగాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం తోసిపుచ్చినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో రివర్స్ గేర్ వేసి.. గతంలోకి వెళ్లలేమని, అది అసాధ్యమని పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు.



## వాణిజ్య ఒప్పందంతో తగ్గనున్న స్కాచ్, కార్ల ధరలు

- ప్రజలకు అత్యుత్తమ సేవలే లక్ష్యం
- భారత్-ఐరోపా సమాఖ్య మధ్య స్వేచ్ఛావాణిజ్యం
- ఒప్పందం కుదిరిందన్న ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,జనవరి27(అక్షరగళం): భారత్–ఐరోపా సమాఖ్య మధ్య స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం కుదిరినట్లు ప్రధాని నరేంద్రమోదీ వెల్లడించారు. భారత్–ఈయూ మధ్య ఎఫ్‌టీఏ కుదిరింది. ప్రపంచవ్యాప్తంగా ప్రజలు దీనిని మదర్ ఆఫ్ ఆల్ డీల్స్‌గా చర్చించుకుంటున్నారని పేర్కొన్నారు. మంగళవారం గోవాలో ఇండియా ఎనర్జీ వీక్–2026ను వర్చువల్‌గా ప్రారంభించిన సందర్భంగా మిగతా.. 2లో

## నేటి నుంచే మేడారం జాతర

- మొదలైన జాతర సందడి
- పగిడిద్దరాజు, జంపన్నలను చేర్చే ఘట్టం ప్రారంభం
- భారీగా ఏర్పాట్లు చేసిన తెలంగాణ ప్రభుత్వం



ములుగు,జనవరి27(అక్షరగళం): రెండేళ్లకోమారు జరిగే మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతరకు సర్వం సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వం దీనిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ఏర్పాట్లు చేసింది. బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు జాతర సాగనుంది. అమ్మవార్లను గద్దెలకు తీసుకుని రావడం మొదలు.. మళల్‌ఈ అడవికి తరలించే వరకు జాతర సాగుతుంది. ఈ మహా ఘట్టాన్ని సమర్థంగా.. భక్తులకు ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖలు సన్నద్ధమయ్యాయి. మిగతా.. 2లో




## రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులు

- కార్పొరేట్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు
- రేపు పఠాన్‌చెరువులో ఇంటిగ్రేటెడ్ భవనానికి శంకుస్థాపన
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2లో

## మోగిన తెలంగాణ మున్సిపల్ నగారా




- ఫిబ్రవరి 11న పోలింగ్...12 అవసరమైతే రీపోలింగ్
- ఫిబ్రవరి 13న కౌంటింగ్ ..అదేరోజు ఫలితం వెల్లడి
- 16న మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల ఎంపిక
- నేటినుంచే నామినేషన్ల స్వీకరణ..30 వరకు గడువు
- 31న నామినేషన్ల పరిశీలన...ఫిబ్రవరి 3 వరకు ఉపసంహరణ
- వెంటనే అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్
- షెడ్యూల్ ప్రకటించిన కమిషనర్ రాణి కుముదిని

హైదరాబాద్,జనవరి27(అక్షరగళం): తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగింది. 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు సంబంధించి 2026 సాధారణ ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారికంగా విడుదల చేశారు. ఫిబ్రవరి 11న పోలింగం నిర్వహిస్తారు. రీ పోలింగ్ అవసరమైన చోట్ల 12న జరుపుతారు. వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి రాగా, నేటినుంచే నామినేషన్ల స్వీకరణ మొదలు కానుంది. ఈ ఎన్నికల ప్రక్రియ ద్వారా మొత్తం 52 లక్షల 43 వేల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ప్రజాస్వామ్య పండుగలో ప్రతి ఒక్కరూ భాగ స్వాములు కావాలని, ఓటు హక్కును తప్పని సరిగా వినియో గించు కోవాలని కమిషనర్ ఈ సందర్భంగా కోరారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈ నెల 28వ తేదీ బుధవారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. అభ్యర్థులు తమ నామినేషన్లను జనవరి 30వ తేదీ సాయంత్రం 5:00 గంటల వరకు దాఖలు చేయవచ్చు. జనవరి 31న నామినేషన్ల పరిశీలన చేపట్టి, అదే రోజు సాయంత్రం అర్హత పొందిన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. ఫిబ్రవరి 3వ తేదీ మధ్యాహ్నం 3:00 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. అనంతరం తుది బరిలో నిలిచే అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, మిగతా.. 2లో



## దోచుకుంటున్న కార్పోరేట్ స్కూళ్లు

- తాను విద్యామంత్రి అయితే వాటిని మూయించేస్తా
- నల్లగొండలో ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ స్కూలు నిర్మాణం
- 8 కోట్లతో అత్యాధునికంగా నిర్మించామన్న కోమటిరెడ్డి

నల్లగొండ,జనవరి27(అక్షరగళం): కార్పొరేట్ స్కూళ్లలో అధిక ఫీజులతో ప్రజలను దోచుకుంటు న్నారని.. తాను విద్యాశాఖ మంత్రి అయితే అలాంటి స్కూళ్లను మూసివేయిస్తానని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. విద్య వ్యాపారం కావద్దని తేల్చిచెప్పారు. మంగళవారం నల్గగొండ టౌన్‌లోని బొట్టుగూడలో కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన ప్రభుత్వ పాఠశాలను ఆయన ప్రారంభించారు. అనంతరం కోమటిరెడ్డి మాట్లాడుతూ.. 'నల్లగొండ ప్రజల రుణం తీర్చుకోవడానికే నల్లగొండ మున్సిపాలిటీని కార్పొరేషన్ చేశా. కేంద్రం నుండి నిధులు తెచ్చి నల్లగొండ రూపు రేఖలు మారుస్తానని అన్నారు. నేను ప్రధాని నరేంద్ర మోదీని కలిస్తే వెయ్యి, 2 వేల కోట్ల రూపాయల మిగతా.. 2లో



## బడ్జెట్ పద్దులకు తుది మెరుగులు

- నార్త్ బ్లాక్‌లో హల్వా వేడుకలు
- పాల్గొన్న ఆర్థికమంత్రి నిర్మలా సీతరామన్

న్యూఢిల్లీ,జనవరి27(అక్షరగళం): ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టబోయే కేంద్ర బడ్జెట్‌కు సంబంధించిన పనులు తుది దశకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా ఏటా నిర్వహించే హల్వా వేడుకను ఆర్థిక శాఖ కార్యాలయం నార్త్ బ్లాక్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ వేడుకలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సహాయ మంత్రి పంకజ్ చౌధరీ పాల్గొన్నారు. అలాగే ఆర్థిక శాఖ పరిధిలోని అన్ని విభాగాల కార్యదర్శులు, బ్జడెట్ రూప కల్పనలో భాగమైన అధికారులు కూడా హాజరయ్యారు. అనంతరం ఆమె బ్జడెట్ ప్రెస్‌ను పరిశీలించారు. ప్రింటింగ్, ఇతర ఏర్పాట్లను పర్యవేక్షించారు. మిగతా.. 2లో

## మేడారం మహా జాతరను వైభవంగా జరుపుకోవాలి

- రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు



హైదరాబాద్, జనవరి27(అక్షరగళం): ఆత్మగౌరవానికి ప్రతీకలుగా నిలిచిన మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతర సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా, తెలంగాణ కుంభమేళాగా పేరొందిన మేడారం జాతరను వైభవంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

గిరిజన ఆదివాసీ ఆచార సంప్రదాయాలతో నాలుగు రోజుల పాటు జరిగే ఈ పండుగను వనదేవతల మహోత్సవంగా నిర్వహించాలని పేర్కొన్నారు. కోటిన్నరకు పైగా భక్తులు తరలివచ్చే జాతరకు రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా విస్తృత ఏర్పాట్లు చేసిందన్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా మేడారం ఆలయాన్ని ప్రజా ప్రభుత్వం మిగతా.. 2లో




## యాసిడ్ దాడుల కేసులో కీలక మలుపు

- నిందితుల ఆస్తులు వేలం వేసి, బాధితులకు పరిహారం
- సుప్రీం చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ కీలక ఆదేశాలు

న్యూఢిల్లీ,జనవరి27(అక్షరగళం): యాసిడ్ దాడుల కేసుల్లో బాధితులకు అండగా సుప్రీం కోర్టు నిలిచింది. వారికి అందచేస్తున్న పరిహారం సరిపోదని అభిప్రాయపడింది. నిందితుల ఆస్తులను వేలం వేసి బాధితులకు పరిహారంగా ఎందుకు ఇవ్వకూడదని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. జీవితాంతం చికిత్స, పునరావాసం కోసం ప్రస్తుతం బాధితులకు అందజేస్తున్న పరిహారం కనీసం రూ.3 లక్షలు సరిపోదని పేర్కొంది. ఈ విషయంలో మెరుగైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించింది. ఈ దారుణమైన నేరాలను నివారించేందుకు అసాధారణమైన శిక్షలు అవసరమని, ఈ దిశగా చట్టంలో మార్పులు చేయాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ సూచన చేశారు. యాసిడ్ దాడి బాధితురాలు షాహీన్ మాలిక్ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీం ధర్మాసనం విచారించింది. బలవంతంగా యాసిడ్ తాగించిన ఘటనల్లో బాధితులకు తగిన పరిహారం, వైద్య సంరక్షణ సహా ఇతర ఉపశమనాలు లభించేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. తనపై జరిగిన యాసిడ్ దాడి కేసులో ఇప్పటికే 16 ఏళ్లు పోరాడానని, కానీ.. ట్రయల్ కోర్టులో నిందితులందరూ నిర్దోషులుగా విడుదలయ్యారని ఆమె ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ కేసులో పోరాడుతూ తన జీవితంలో విలువైన కాలాన్ని కోల్పోయానని చెప్పారు. అయితే.. బాధితురాలి తరఫున హైకోర్టులో మంచి న్యాయవాది ఈ కేసును వాదించేలా మిగతా.. 2లో

## సీఎం అంటే కోల్ మాఫియా

- 'సైట్ విజిట్ సర్టిఫికేషన్' అనే విధానం ఎందుకు పెట్టారు?
- రెండున్నర మూడు కోట్లలో అయ్యే పని దేశం మొత్తంలో.. ఒక్క తెలంగాణలో మాత్రం ఏడు కోట్లు ఎందుకు అవుతుంది?
- విదేశాల్లో తిరుగుతూ ఏదో పాఠాలు నేర్చుకుంటున్నా అంటూ ఫోజులు
- చదువుకోవాల్సిన టైంలో చదువుకోక ఇప్పుడు చదువుకుంటానంటే ఏం వస్తుంది?
- గవర్నర్‌జీ.. బొగ్గు కుంభకోణంపై మీరు జోక్యం చేసుకోండి
- సిబిఐకి ఇస్తారా? సిట్టింగ్ జడ్జికి ఇస్తారా? మీ ఇష్టం ఎవరికి ఇస్తారో ఇవ్వండి.
- రాష్ట్ర గవర్నర్‌ని కలిసిన అనంతరం మీడియా తో భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్,(అక్షరగళం):మా పార్టీ తరఫున శాసనమండలి సభ్యులు, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యుల బృందం, మా సీనియర్ నాయకుల బృందం అందరం కలిసి గవర్నర్‌కు ఒక వివరమైన విజ్ఞాపన పత్రాన్నిఇచ్చాం.రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, ముఖ్యంగా సింగరేణిలో జరుగుతున్న దోపిడీ విషయంలో వారికి అందజేయడం జరిగింది. సింగరేణిలో అవినీతి జరుగుతున్నదని ఆధారాలతో సహా మా శాసన సభాపక్ష ఉపనాయకులు, మాజీ మంత్రి హరీష్ రావు పత్రికా సమావేశంపెట్టి, ఆధారాలతో సహా బయటపెట్టినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీలో వణుకు మొదలైంది.

మీడియా కూడా మాకు సహకరించి, ఈ కుంభకోణాన్ని పూర్తిస్థాయిలో బట్టబయలు చేసేసరికి పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతా ఉన్నాయి. కేవలం మాట్లాడటమే కాదు, ఆధారాలతో సహా మరి ఈరోజు పూర్తిస్థాయిలో ఈ కుంభకోణాన్ని బట్టబయలు చేసినం. దాన్ని డైవర్ట్ చేయడానికి, ప్రజల అటెన్షన్‌ని, మిగతా.. 2లో



## సిట్ విచారణకు హాజరైన సంతోష్ రావు

హైదరాబాద్,జనవరి27(అక్షరగళం): బీఆర్ఎస్ పార్టీ కీలక నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్‌రావు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ ఎదుట విచారణకు హాజరయ్యారు. జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయంలో సిట్ అధికారులు ఆయనను విచారిస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరుకావాలంటూ సిట్ సోమవారం ఆయనకు నోటీసులు ఇచ్చింది. దాంతో ఇవాళ సంతోష్‌రావు సిట్ అధికారుల ఎదుట విచారణకు వచ్చారు. సోమవారం సిట్ నోటీసులు అందుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తాను రేపు సిట్ అధికారుల ఎదుట విచారణకు హాజరవుతానని, కేసు సంబంధించి వారు అడిగే అన్ని ప్రశ్నలకు సమాధానాలు చెబుతానని అన్నారు.



తెలుగు దినపత్రిక https://aksharagalam.com

అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం

తెలంగాణ రౌండప్


# శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**కల్వకుర్తి, జనవరి 27(అక్షరగళం):** కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీ వెంకటేశ్వర స్వామిని మంగళవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తో పాటు ఆమనగల్ మార్కెట్ కమిటీ వాజీ చైర్మన్ బట్టు కిషన్ రెడ్డి తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి నాయకులు సూదిని కొండల్ రెడ్డి ఉన్నారు.

ఈ సందర్భంగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని టీటీడీ ఆధ్వర్యంలో ఆ ఎమ్మెల్యేతో పాటు నాయకులను శాలువాలతో సన్మానించారు.



# కల్వకుర్తి మున్సిపల్ ఎన్నికల్లో ఆర్యవైశ్యులకు అవకాశం కల్పిస్తా..

**ఆర్యవైశ్యులకు అన్ని విధాలుగా అండగా నిలబడతా.**

**బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్.**

**ఉప్పల వెంకటేష్‌ను కలిసిన కల్వకుర్తి ఆర్యవైశ్య సంఘం నాయకులు.**

**కల్వకుర్తి, జనవరి 27(అక్షరగళం):** కల్వకుర్తి మున్సిపల్ ఎన్నికల్లో పోటీ అవకాశం ఉన్నవారికి కచ్చితంగా ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పిస్తామని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ అన్నారు. మంగళవారం కల్వకుర్తి ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షుడు గంధం కిరణ్ ప్రసాద్ దాచేపల్లి శ్రీనివాసులు నేతృత్వంలో ఆర్యవైశ్యులు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ను హైదరాబాద్లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. కల్వకుర్తి మున్సిపల్ ఎన్నికల్లో ఆర్యవైశ్యులకు పోటీ చేసేందుకు ప్రాధాన్యతను ఇవ్వాలని అవకాశం ఉన్నవారికి కచ్చితంగా బిఆర్ఎస్ పార్టీ తరఫునుండి అవకాశం కల్పించాలని ఉప్పల వెంకటేష్ దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించిన ఆయన మాట్లాడుతూ స్థానిక నేతలతో చర్చలు జరపాలని ఈ విషయంపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు దృష్టికి తీసుకువెళ్లి ఆర్యవైశ్యులకు అనుకూలంగా అవకాశం ఉన్నచోట పోటీ చేసేందుకు వీలుగా బి ఫామ్ ఇప్పించేందుకు తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు.

ఆర్యవైశ్యులను విద్యా వైద్యంతో పాటు ఇల్లు లేని నిరుపేద ఆర్యవైశ్య కుటుంబాలకు అండగా నిలుస్తామని ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారం కృషి చేస్తానని ఆర్యవైశ్యులందరూ వ్యాపారంతో పాటు రాజకీయరంగంలో రాణించాలని కల్వకుర్తి మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలిపి ఎన్నికల్లో మున్సిపల్ చైర్మన్ పదవి దక్కేల కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు గంప శ్రీను పూరి రమేష్ పోల నరేష్ రవి తదితరులు ఉన్నారు.



# మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగరాలి

**- గుర్రం కేశవులు**

**ఆమనగల్లు, జనవరి 27 (అక్షర గళం):** మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగరవేసేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు, ఆమనగల్లు మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు పిలుపునిచ్చారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని జంగారెడ్డి పల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు దుడ్డు లక్ష్మయ్య తన అనుచరులతో కలిసి మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు ఖాదర్ ఖాద్రి ఆధ్వర్యంలో కేశవులు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు వస్పుల మానయ్య తో కలిసి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. అనంతరం కేశవులు విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి వివిధ పార్టీల నాయకులు ప్రజలు స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. కాంగ్రెస్ తోనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని అన్నారు. సామాజిక న్యాయం కాంగ్రెస్ తోనే సాధ్యమన్నారు. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో ఆమనగల్లు మున్సిపాలిటీలో గణనీయమైన అభివృద్ధి సాధించిందన్నారు. రూ. 63 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించినట్లు చెప్పారు. 360 మందికి ఇందిరమ్మ ఇల్లు, 520 మందికి రేషన్ కార్డులు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. రూ. 2 కోట్లతో మున్సిపాలిటీ భవనం, రూ.4 కోట్లతో బీసీ వసతి గృహ భవనం రూ. 17.50 కోట్లతో ఆసుపత్రి భవనం నిర్మిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మున్సిపాలిటీ అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యమని కేశవులు. మానయ్య, ఖాదర్ లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు అవ్వారి శివలింగం, కాలే మల్లయ్య, అబ్దుల్ ఖాదర్, మైసయ్య, శ్రీనివాస్ డి, శ్రీను నాయక్, రమేశ్, శేఖర్, కొండల్ రెడ్డి, సాయిలు, నేనావత్ రమేశ్, జైపాల్ నాయక్ తదితరులు ఉన్నారు.

## నేడు కల్వకుర్తి ఎక్సైజ్ కార్యాలయంలో

# వాహనాల వేలం..

**ప్రొబిషన్ ఎక్సైజ్ సీఐ జె.వెంకట్ రెడ్డీ**

**కల్వకుర్తి, జనవరి 27(అక్షరగళం):** కల్వకుర్తి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఎక్సైజ్ దాడుల్లో అక్రమంగా నాటు సారా బెల్లం రవాణా చేస్తు పట్టుబడిన పలు ద్విచక్ర వాహనాలు ఆటో ఫోర్ వీలర్ వాహనాలకు బుధవారం కల్వకుర్తి మార్కెట్ యార్డులో ఎక్సైజ్ కార్యాలయం నందు ఉదయం 11 గంటలకు వేలంపాట నిర్వహిస్తున్నామని కల్వకుర్తి ప్రొబిషన్ ఎక్సైజ్ ఎస్ హెచ్ ఓ జె.వెంకట్ రెడ్డి మంగళవారం మీడియాకు తెలిపారు. వేలంపాట నాగర్ కర్నూల్ జిల్లా ఎక్సైజ్ అధికారిని డి.గాయత్రి సమక్షంలో నిర్వహిస్తున్నామని ఆసక్తి గలవారు నిర్నిత రుసుము



చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

# పాడి రైతుల సమస్యలను పరిష్కరించాలి

- **విజయ పాలపై ఎస్ఎన్ఎఫ్ డిటెన్షన్ పరిధి ఎత్తివేయాలి**
- **డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా, విజయ పాల డైరీ అధ్యక్షుడు కడారి రామకృష్ణ**

**ఆమనగల్లు, జనవరి 27 (అక్షర గళం):** కడ్తాల్ మండల కేంద్రంలో విజయ పాల డైరీ రైతులు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్ లో తెలంగాణ రాష్ట్ర విజయ పాల సహకార సంఘం చైర్మన్ గుత్త అమిత్ రెడ్డి, ఎండి చంద్రశేఖర్ రెడ్డిలను కలిసి వినతి పత్రం అందజేసినట్లు డీసీసీబీ డైరెక్టర్ ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, విజయ పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు కడ్తాల్ మాజీ ఉప సర్పంచ్ కడారి రామకృష్ణ ఆధ్వర్యంలో విజయ పాడి రైతులతో కలిసి కలిసి వినతిపత్రం అందజేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో కడ్తాల్ మండల కేంద్రంలో ఎక్కువ మంది రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారని తెలంగాణ రాష్ట్రంలో



అన్ని మండలాల కంటే కడ్తాల్ మండలంలో అత్యధికంగా 2,70,000 పాల ఉత్పత్తి కడ్తాల్ మిల్క్ చిల్లింగ్ సెంటర్ కు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. కడ్తాల్ మండలం నుంచి పెద్ద మొత్తంలో పాల సరఫరా జరుగుతుందని వీటిని దృష్టిలో పెట్టుకొని ఈ ప్రాంత పాడి రైతులను ఆదుకోవాలని వారు కోరారు. పాల ధరలు పెంచాలని అదేవిధంగా విజయపాల ఉత్పత్తిలో కొనసాగుతున్న ఎస్.ఎన్.ఎఫ్.డి టెన్షన్ పరిధిని ఎత్తి వేయాలని వారు కోరినట్లు తెలిపారు. ఈ ప్రాంత రైతుల సమస్యలను విన్న చైర్మన్, ఎండి సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో పాడి రైతులు రంగయ్య, శ్రీకాంత్ రెడ్డి, జితేందర్ రెడ్డి, దశరథం, లాలు నాయక్, రాజ్యా నాయక్, పత్య నాయక్, నర్సింహారెడ్డి, ప్రవీణ్ యాదవ్, బాలా చారి, మల్లేష్, శంకర్, కృష్ణయ్య, హరియానాయక్, వెంకటేష్, పూర్యానాయక్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# మ్రోగిన ఎన్నికల నగారా..!!

- **నేటి నుండి నామినేషన్ల స్వీకరణ**
- **ఎన్నికల ఏర్పాట్లకు సిబ్బందితో సమావేశం.**
- **మున్సిపల్ కమిషనర్ మొహమ్మద్ షేక్.**

**కల్వకుర్తి, జనవరి 27(అక్షరగళం):** మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో కల్వకుర్తి పురపాలక సంఘం ఎన్నికలకు ఏర్పాట్లను మంగళవారం సిబ్బందితో మున్సిపల్ కమిషనర్ సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో కల్వకుర్తి పురపాలక సంఘం నందు ఎన్నికల నిర్వహణకు అనుగుణంగా ఏర్పాట్లు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు లోకి వచ్చిందని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. 28న నామినేషన్ తీసుకొనుటకు రిటర్నింగ్ అధికారులకు అవసరమగు ఏర్పాట్లు చేయడం జరిగిందని కార్యాలయం నందు నామినేషన్ సమర్పించే వారి కొరకు హెల్ప్ డెక్స్ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే మున్సిపల్ ఎన్నికలకు రిజర్వేషన్లు ఖరార్ అయ్యాయి. కల్వకుర్తి మున్సిపల్ ఓటర్ల సంఖ్య 26,023,వార్డుల సంఖ్య 22, పోలింగ్ బూతుల సంఖ్య 44 ఏర్పాట్లను పూర్తి చేశామని ఎన్నికలు పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి అసిస్టెంట్ ఇంజనీర్ షబ్బీర్ అహ్మద్ మేనేజర్ రాజకుమారి నోరీ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.




# అండగా ఉంటా అధైర్యపడొద్దు..

**- మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్**

**ఆమనగల్లు, జనవరి 27 (అక్షర గళం):** కడ్తాల్ మండల పరిధిలోని మైసిగండి గ్రామానికి చెందిన జటోత్ కమ్లి అనారోగ్యంతో సోమవారం మరణించింది.

విషయాన్ని మైసిగండి గ్రామ నాయకుల ద్వారా తెలుసుకున్న మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్ మంగళవారం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం కల్పించారు. కమ్లి కుటుంబ సభ్యులకు అండగా నిలిచి అధైర్యపడొద్దని భరోసనిచ్చారు. సహాయ సహకారాలు చేయడానికి తను ముందుంటానని మృతురాలి కుటుంబానికి ధైర్యం కల్పించారు.

రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ తరఫున 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించి కమ్లి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తులసి రామ్ నాయక్ మాజీ ఎంపీటీసీ సక్రీ, గ్రామ కమిటీ అధ్యక్షుడు రవి నాయక్,



మాజీ వార్డు సభ్యులు పత్య నాయక్ నాయకులు శీను, శివ, శీను, మల్లేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల సేవే లయన్స్ క్లబ్ లక్ష్యం

**లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ చెన్న కిషన్ రెడ్డి**

**ఆమనగల్లు, జనవరి 27 (అక్షర గళం):** పేదల సేవే లయన్స్ క్లబ్ లక్ష్యమని లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ చెన్న కిషన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో కడ్తాల బస్టాండ్ ఆవరణలో కీర్తిశేషులు సుశీలమ్మ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న ప్రసాద కార్యక్రమాన్ని క్లబ్ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డితో కలిసి చెన్న కిషన్ రెడ్డి ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ సమాజ సేవలో అగ్రగామి సంస్థగా నిలుస్తోందని, పేద ప్రజలకు సహాయం అందించడం, విద్యార్థులకు ప్రోత్సాహం అందించడం, ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించడం వంటి సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా 400 మందికి అన్న ప్రసాదం అందజేసినట్లు క్లబ్ పిఆర్ఓ పాషా తెలిపారు. అదేవిధంగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు మరియు లియో క్లబ్ ఆధ్వర్యంలో కడ్తాల మండల పరిధిలోని పాఠశాలల్లో రోడ్డు భద్రత తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు మెమెంటో సర్టిఫికెట్లను అందజేసినట్లు క్లబ్ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గంప శ్రీను, లయన్ సభ్యులు బిచ్యా నాయక్, జలకం రమేష్, బూరె రాజేందర్, జహంగీర్ అలీ, శ్యాంసుందర్ గౌడ్, సురేష్, ముత్తికృష్ణ తదితరులు పాల్గొన్నారు.





# ఫిబ్రవరి 12న దేశవ్యాపిత సార్వత్రిక సమ్మె..

**సిపిడిఓ కు సమ్మె నోటీసు అందజేత.**

**అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాసము.**

కల్వకుర్తి, జనవరి 27(అక్షరగళం): ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాపిత సార్వత్రిక సమ్మె లో అంగన్వాడి టీచర్స్ ఆయాలు అందరూ పాల్గొంటారని తెలియజేస్తూ అంగన్వాడి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని అదేవిధంగా లేబర్ కోడ్లను రద్దు చేయాలని ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెలో పాల్గొనబోతున్నట్లు మంగళవారం సిడిపిఓ కల్వకుర్తి ప్రాజెక్టు కి సిఐటియు తెలంగాణ అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె నోటీస్ ఇవ్వడం జరిగినది. ఈ సందర్భంగా అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాసము మాట్లాడుతూ అంగన్వాడి ఉద్యోగులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని అదేవిధంగా రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని పెన్షన్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మెలో అంగన్వాడీ టీచర్స్ మరియు హెల్పర్స్ అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ప్రాజెక్టు కమిటీ కార్యదర్శి పద్మ, కోశాధికారి జయమ్మ, సిఐటియు జిల్లా అధ్యక్షులు బి. ఆంజనేయులు జిల్లా కార్యదర్శి పులిజాల పరుశరాములు పాల్గొన్నారు.

## 5వ వార్డు స్వతంత్ర అభ్యర్థిగా

# కోరే రవి

ఆమనగల్లు, జనవరి 27 (అక్షర గళం): ఆమనగల్లు మున్సిపాలిటి 5వ వార్డు అభివృద్దే ద్యేయంగా గత పాలకుల నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ అభివృద్ధి మొదటి ఎజెండాగా ఆమనగల్లు మున్సిపల్ ఎన్నికలలో 5వ వార్డు నుండి ప్రజలు



అవకాశం ఇస్తే స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉంటానని యువనాయకుడు కోరే రవి అన్నారు. 5వ వార్డు ప్రజలు నన్ను ఆశీర్వదించి అవకాశం ఇస్తే వార్డు మరియు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడతానని, 5వ వార్డు ప్రజలు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు.



# సంప్రదాయ నృత్యాలు సంస్కృతికి మూలాలు

**- జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి**

ఆమనగల్లు, జనవరి 27 (అక్షర గళం): సంప్రదాయ నృత్యాలు భారతీయ సంస్కృతికి మూలాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సముదాయ ఆవరణలో సాంస్కృతిక వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో ఆమనగల్లు మండల కేంద్రానికీ చెందిన శృతిలయ కల్చరల్ అకాడమీ వారిచే చేపట్టిన సంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అభిరుచి ఉన్న రంగాల్లో రాణించాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి సుసిందరావు, శృతిలయ కల్చరల్ అకాడమీ చైర్మన్ దార్ల చిత్తరంజన్ దాస్, ఉపాధ్యాయులు ధనలక్ష్మి, వసంత, భవాని, నీరజ మరియు డాన్స్ మాస్టర్ రవికాంత్, విద్యార్థి విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

# రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం..

**- మాజీ రాజ్యసభ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి**

ఆమనగల్లు, జనవరి 27 (అక్షర గళం): కడ్తాల్ మండల కేంద్రంలో మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్ తన రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చేస్తున్న సేవలు అభినందనీయమని మాజీ రాజ్యసభ సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. మాధవసేవ మానవ సేవ అంటూ కడ్తాల్ మండలంలో ఎనలేని సేవలు చేస్తు నలుగురికి ఆదర్శంగా నిలుస్తున్న ట్రస్ట్ రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ అని ఎంతోమంది నిరుపేద అమ్మాయిల పెళ్లిళ్లకు 21000 వేల రూపాయలు ఒక పట్టు చీర ప్రతిరోజు అన్నదాన కార్యక్రమం మండల కేంద్రంలో ఎవరైనా చనిపోతే 5000 రూపాయలను యువతను ఉత్సాహము ఇస్తూ క్రీడల పోటీలు మొదటి బహుమతి రెండో బహుమతిగా భారీ నజరానాలు, హెల్త్ క్యాంపులు విద్యార్థినీ విద్యార్థులపై చదువులకు సహాయ సహకారాలు చేస్తూ అనాధలకు అభాగ్యులకు వృద్ధులకు దుప్పట్ల పంపిణీ చేస్తూ ముందుకు వెళ్తున్న ఏకైక ట్రస్ట్ రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ అని ఆయన కొనియాడారు.



# ఉద్యోగుల హక్కులను కాపాడుతాం..

**- ఆల్ మేవా క్యాలెండర్, డైరీ ఆవిష్కరించిన రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి**

హైదరాబాద్: ఉద్యోగస్తుల హక్కులను కాపాడుతాం. ముఖ్యంగా మైనారిటీ ఉద్యోగస్తుల హక్కులు కాపాడుతామని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అన్నారు. మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో తెలంగాణ ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ 2026 డైరీ, క్యాలెండర్ను చిన్నారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ, రాజ్యాంగ బద్ధంగా మైనార్టీలకు రావలసిన హక్కులను కాపాడటంలో అవసరమైతే పోరాటం చేసి వాటిని అమలు అయ్యేట్లు కాంగ్రెస్ పార్టీ పూర్తి చిత్తశుద్ధితో కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆల్ మే వావా రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ఫరూక్ హుస్సేన్, డాక్టర్



వహీద్ షా ఖాద్రి, కోశాధికారి ఏం. ఏ. రషీద్, రాష్ట్ర నాయకులు జావేద్ అహ్మద్, తక్వుద్దీన్ అహ్మద్, ప్రవాస భారతీయుడు ముహమ్మద్ వాజీద్, సయ్యద్ అజమ్ హుస్సేన్, ఖాజా ఫరూఖ్ అలీ, ముంతాజ్ అలీ, అతి ఖుర్ రెహమాన్, తదితరులు పాల్గొన్నారు.









# ఉద్యోగుల కోసం పోరుబాట

- ◆ రిటైర్మెంట్ ప్రయోజనాల కోసం బీజేపీ ధర్నా
- ◆ ఇందిరా పార్క్‌లో భారీ నిరసన



హైదరాబాద్, జనవరి 27 (అక్షర గళం): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ ప్రయోజనాలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరా పార్క్‌లో భారీ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఈ ధర్నాకు బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలతో పాటు పెద్ద సంఖ్యలో రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లు హాజరయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పూర్తిగా విస్మరిస్తోందంటూ నిరసన వ్యక్తం చేశారు. ధర్నాను ఉద్దేశించి ఎన్. రాంచందర్ రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించిన గ్రాట్యుటీ, కమ్యూటేషన్, జీపీఎఫ్, జీఐఎస్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, పీఆర్సీ, డీఏలు వంటి కీలక ప్రయోజనాలు పూర్తిగా నిలిచిపోయాయని ఆరోపించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండటం దురదృష్టకరమన్నారు.

**రూ.2 వేల కోట్లకు పైగా బకాయిలు**

రిటైర్డ్ ఉద్యోగులకు దాదాపు రూ.2 వేల కోట్లకు పైగా బెనిఫిట్స్ బకాయిలుగా ఉన్నాయని తెలిపారు. గతేడాది డిప్యూటీ సీఎం ప్రతి నెల రూ.700 కోట్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చినా, ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదని విమర్శించారు. హామీలు ఇచ్చి అమలు చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. రిటైర్మెంట్ ప్రయోజనాలు అందక ఉద్యోగులు, పెన్షనర్లు తీవ్ర ఆర్థిక, మానసిక ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పలువురు రిటైర్డ్ ఉద్యోగులు మన స్తాపంతో మరణించిన ఘటనలు చోటుచేసు కోవడం ఆందోళన కలిగించే అంశమన్నారు.

ఉద్యోగాల హామీలు అమలు కాకపోవ డంతో వేలాది మంది నిరుద్యోగులు తీవ్ర నిరాశలో ఉన్నారని అన్నారు. టీఎస్‌పీఎస్సీ పరీక్షలలో అవకతవకలు, కోర్టు కేసుల వల్ల యువత భవిష్యత్ అగాధంలో పడిందని విమర్శించారు. విశ్వవిద్యాలయాల్లో జీతాలు సకాలంలో అందక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లు తెలంగాణ రాజకీయాలను మార్చే శక్తి కలిగి ఉన్నారని రాంచందర్ రావు అన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో తమ సమస్యలను ఓటు రూపంలో వ్యక్తం చేసి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఉద్యోగుల హక్కుల కోసం బీజేపీ ఉద్యమం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# గుంపు మేస్త్రికి గూఢచారి సంతోష్

**కేసీఆర్ తినే ఇడ్లీ సమాచారాన్ని కూడా రేవంత్‌కు చేరవేస్తాడు**

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపణ**

హైదరాబాద్, జనవరి 27 (అక్షర గళం): గుంపు మేస్త్రికి ప్రధాన గూఢచారియే సంతోష్ రావు. కేసీఆర్ తినే ఇడ్లీ సమాచారాన్ని కూడా రేవంత్ రెడ్డికి చేరవేసే వ్యక్తి ఆయన అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. నిజామాబాద్‌లో గంజాయి ముఠా దాడిలో తీవ్రంగా గాయపడిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యను, ఆమె కుటుంబ సభ్యులను హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌లో ఆమె పరామర్శించారు. సౌమ్య కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత ఆమె మీడియాతో మాట్లాడారు.

తన గూఢచారికి శిక్ష పడకుండా రేవంత్ రెడ్డి కాపాడుకునే పరిస్థితి ఉంది. కేసీఆర్‌కు ఉద్యమకారులను, అమరవీరుల కుటుంబాలను దూరం చేసిన దుర్మార్గుడు. పోలీసులు నిజాయితీగా పనిచేస్తే సంతోష్ రావుకు కచ్చితంగా శిక్ష పడుతుంది. నేను చెప్పిన దయ్యాల్లో మొదటి దెయ్యం సంతోష్ రావే. ఆయనకు హరీష్ రావు, కేటీఆర్‌లు ఎందుకు వత్తాసు పలుకుతున్నారో అర్థం కావటం లేదు. గంజాయి, డ్రగ్స్ ముఠాలకు తగిన గుణపాఠం చెప్పాలి. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గారు ఉద్యమకారులకు, అమరవీరుల కుటుంబాలకు దూరం కావటానికి కారణం సంతోష్ రావు. గద్దర్ లాంటి నాయకులు గంటలు గంటలు గేట్ బయట వేచి చూడటం, ఈటల లాంటి వారు బయటకు రావటానికి కూడా ఈ సంతోష్ రావే కారణం. గుంపు మేస్త్రికి ప్రధాన గూఢచారి సంతోష్ రావు. అందుకే ఆ గూఢచారిని శిక్షిస్తాడని నేను నమ్మటం లేదు. సంతోష్ రావును సిట్ పిలవటం మంచిదే. కానీ ఆయనకు శిక్ష పడటం అనుమానమే. ఇటువంటి దుర్మార్గుడికి కేటీఆర్ గారు, హరీష్ రావు గారు ఎందుకు వత్తాసు పలుకుతున్నారో అర్థం కావటం లేదు. నేను గతంలో చెప్పిన



దయ్యాల్లో మొదటి దయ్యమే సంతోష్ రావు. నిజంగా చట్టం తన పని తాను చేసుకుంటూ పోతే కచ్చితంగా ఈ దుర్మార్గుడికి శిక్ష పడుతుంది. రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా పోలీసులు తమ పని తాము చేయాలని నేను విజ్ఞప్తి చేస్తున్నా. ఒక్కోసారి మన నీడ కూడా మన కళ్లను కప్పే పరిస్థితి వస్తుంది. ఉద్యమకారులను కేసీఆర్ గారికి దూరం చేసిన పాపం కచ్చితంగా ఈ దుర్మార్గుడికి తగులుతుంది. ఒక ఎక్సైజ్ కానిస్టేబుల్‌ను చంపే ధైర్యం గంజాయి బ్యాచ్ చేసిందంటే ప్రభుత్వం అంటే వారికి ఏ మాత్రం భయం లేదని స్పష్టమవుతోంది. డ్రగ్స్, గంజాయి ఫ్రీ చేస్తామని ఈ ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ దురదృష్టమేమిటంటే గ్రామాల్లో కూడా ఫ్రీగా గంజాయి, డ్రగ్స్ దొరికే పరిస్థితి వచ్చింది. స్కూల్‌లోకి కూడా గంజాయి, డ్రగ్స్ తీసుకొచ్చి పిల్లలను పాడు చేస్తున్నారు. దీని కారణంగా మా ఆడవాళ్లే బాధితులుగా మారే పరిస్థితి ఉంటుంది. గృహహింస ఘటనలు జరగటానికి డ్రగ్స్, గంజాయి కారణమవుతోంది. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం మత్తు వదిలి డ్రగ్స్, గంజాయి మాఫియాపై వారి ప్రతాపం చూపాలి. అదే విధంగా ఎక్సైజ్, ఫారెస్ట్ సిబ్బందికి వెపన్స్ ఇవ్వాలి. వాళ్లకు ట్రైనింగ్‌లో గన్ ఫైరింగ్ ఉంటుంది. కానీ వెపన్స్ ఇవ్వటం లేదు. వారి వద్ద వెపన్స్ ఉంటే గంజాయి, డ్రగ్స్ మాఫియాకు కాస్త భయం ఉంటుంది. డ్రగ్స్, గంజాయి మహమ్మారిని తరిమికొట్టేందుకు జాగృతి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిస్తున్నా. డ్రగ్స్, గంజాయి ముఠాల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. సౌమ్య గారి కుటుంబానికి జాగృతి తరఫున అండగా ఉంటాం... అని కల్వకుంట్ల కవిత తెలిపారు.



# తెలంగాణ రాష్ట్ర శాసనసభను సందర్శించిన జపాన్ అయిచి రాష్ట్ర అసెంబ్లీ ఎకనామిక్ డెవలప్మెంట్ ఫోరం

హైదరాబాద్,జనవరి 27 (అక్షర గళం): ఫోరం చైర్మన్ హిరిహితో కోండో మరియు తొమ్మిది మంది అయిచి రాష్ట్ర ఎమ్మెల్యేల బృందానికి తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ , శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మండలి కార్యదర్శి డాక్టర్ వి. నరసింహా చార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి, అధికారులు స్వాగతం పలికారు. సభాపతి ఛాంబర్ లో సమావేశమైన తెలంగాణ- అయిచి రాష్ట్ర సభ్యుల బృందం, వివిధ రంగాలలో సహకారంపై చర్చించారు.

స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ...తెలంగాణ ప్రాంతం సంస్కృతి, సాంప్రదాయాలు ఉన్నతమైనవి. తెలంగాణ రాష్ట్రం 2014 లో నూతనంగా ఏర్పడింది. శాసనసభలో 119 మంది సభ్యులు, శాసనమండలి లో 40 మంది సభ్యులు ఉన్నారు. శాసనసభ సభ్యులను ఎన్నికల ద్వారా నేరుగా ప్రజలు ఎన్నుకుంటారు. తెలంగాణ శాసనసభలో చర్చలు అర్ధవంతంగా జరుగుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రైజింగ్ నినాదంతో తెలంగాణ రాష్ట్రాన్ని 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చడానికి కృషి చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులకు మంచి అవకాశాలు ఉన్నాయి.

గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ. భారతదేశం జపాన్ దేశాల మద్య మొదటినుంచి చారిత్రక స్నేహ సంబంధాలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం నూతనంగా ఏర్పడినప్పటికీ పెట్టుబడులకు అన్ని విధాలుగా మంచి వాతావరణం ఉన్నది. ఈసందర్భంగా జర్మనీ బృంద సభ్యులకు పుష్ప గుచ్చం అందించి శాలువాతో సత్కరించారు.

తెలుగు దిన పత్రిక
https://aksharagalam.com
అక్షరగళం
నిజం..నిర్భయంగా
గ్రేటర్ -హైదరాబాద్



## మంగళవారం సాయంత్రం నుండి
# మున్సిపల్ ఎన్నికల కోడ్ అమలు

**- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి**

**అక్షర గళం, మేడ్చల్ ప్రతినిధి:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఆలియాబాదు, మూడుచింతల



పల్లి, ఎల్లంపేట్ మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించనున్నందున మంగళవారం సాయంత్రం నుండి ఎన్నికల ప్రవర్తన నియమావళి ననుసరించి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. మున్సిపాలిటిలు, మున్సిపల్ కార్పొరేషన్ ల సాధారణ ఎన్నికల 2026లో భాగంగా ఈ నెల 28 నుంచి 30వ తేది వరకు నామినేషన్లు స్వీకరించబడతాయని తెలిపారు. నామినేషన్ల స్క్రూటిని ఈ నెల 31 నుండి నిర్వహించి అనంతరం ఫిబ్రవరి 3న మధ్యాహ్నం 3.00 గంటల వరకు అభ్యర్థులు విత్ డ్రా చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. తుది జాబితా అదేరోజు ప్రకటిస్తారని తెలిపారు. ఫిబ్రవరి 11న పోలింగ్ జరుగుతుందని, కౌంటింగ్ ఫిబ్రవరి 13న జరుగుతుందని తెలిపారు.మున్సిపల్ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించి వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు., ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికలను నిర్వహించేందుకు అవసరమైన కార్యచరణ, శాంతిభద్రతలను కాపాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళి పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలలో ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఎన్నికల పరిశీలకులకు శిక్షణ అందించడం జరిగిందని అన్నారు. 2011 ఎన్నికల జాబితా ప్రకారం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, 2024 ఎస్ ఈ ఈ ఈ పి సి సర్వే ప్రకారం వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు కేటాయించడం జరిగిందని తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను దీవించండి

**- మధిరలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**మధిర:** మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు అంతా ఉమ్మడి కుటుంబంలో భావించి ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి. అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల కాలంలో పట్టణ ప్రాంతాల్లో రకరకాల ప్రణాళికలతో నివసిస్తున్న పేద, మధ్యతరగతి వర్గాల అభివృద్ధికి అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం.. 2047 విజన్ డాక్యుమెంట్ ప్రకారం త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధించడమే లక్ష్యంగా ప్రపంచంతో పోటీ పడేందుకు మున్సి పల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి. పట్టణ ప్రాంతాల్లో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు మెప్మా ద్వారా మున్సిపాలిటీల్లో మహిళలకు 6000 కోట్ల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేశాం

తెలంగాణ రాష్ట్రం నగర రాజ్యాంగ అభివృద్ధి చెందుతుంది. ఉపాధి అవకాశాలు పెద్ద ఎత్తున పెరుగుతున్నాయి. క్యూర్, ప్యూర్, రేర్ పాలసీని రూపొందించాం. హైదరాబాద్ బయట మున్సిపాలిటీల పరిధిలో అనేక క్లస్టర్లుగా విభజన చేసి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాం. రేర్ రూరల్ అగ్రి రీజనల్ ఎకానమీ ద్వారా వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు నెలకొల్పి మున్సిపాలిటీల సమీపంలోని గ్రామాల్లో ఉపాధి, ఆదాయం పొందేలా చేయడమే ప్రభుత్వం లక్ష్యం. గ్రామాల్లో ఉత్పత్తులకు మున్సిపాలిటీల్లో ప్రణాళికాబద్ధంగా వ్యవసాయ ఉత్పత్తుల విలువను పెంచడమే ప్రభుత్వ లక్ష్యం.

గతంలో రేషన్ కార్డుల కోసం చూసి చూసి అలసిపోయిన వారందరికీ కొత్తగా రేషన్ కార్డులు పంపిణీ చేశాం. రాష్ట్రంలో 1.15 కోట్ల కుటుంబాలు ఉండగా 1.03 కోట్ల కుటుంబాలకు



సన్నబియ్యం పంపిణీ చేస్తున్న బడుగు బలహీన వర్గాలను దృష్టిలో పెట్టుకొని అల్ప ఆదాయ వర్గాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నాం వినియోగదారుల తరపున విద్యుత్ శాఖకు ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తుంది

రాష్ట్రంలోని మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాము. హైదరాబాద్ పట్టణంలోనే కాకుండా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో స్కిల్ డెవలప్మెంట్ కోసం అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేశాం. ప్రపంచ స్థాయి విద్యను పేద బడుగు బలహీన వర్గాలకు అందించేందుకు యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నాం.






## రాందేవ్ రావు హాస్పిటల్‌కి
# అరుదైన పురస్కారం

**అక్షర గళం, కూకట్‌పల్లి:** కూకట్ పల్లి రాం దేవ్ రావు అసుపత్రికి అరుదైన పురస్కారం లభించింది. 77 వ గణతంత్ర దినోత్సవాన్నీ పురస్కరించుకొని సోమవారం గవర్నర్ ఎక్సలెన్సీ 2025 ఎట్ హోమ్ కార్యక్రమాన్ని లోక్ భవన్ నందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ , సుధాదేవ్ వర్మ, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, కేంద్ర మంత్రి జీ.కిషన్ రెడ్డి, ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క లు పాల్గొన్నారు. అనంతరం రాందేవ్రావు హాస్పిటల్ కి గవర్నర్ ద్వారాతెలంగాణ ఉత్తమ హాస్పిటల్ గా ఎంపిక గ్రామీణ , ఫిలాంట్రోపీ వైద్య సేవల నిమిత్తము రాందేవ్ రావు ఆసుపత్రి ని ఎంపిక చేశారని నిర్వాహకులు తెలిపారు. ఆరోగ్య శిభిరాలు, పాఠశాల ఆరోగ్య కార్యక్రమం, వ్యాధి నిరోధక టీకాలు, ఉచిత కంటి , శస్త్ర చికిత్సల ద్వారా సేవలనీదించి గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణ లో రాందేవ్ రావు ఆసుపత్రి సేవలు మరువలేనివి.ఈ పురస్కారం 2 లక్షల రూపాయలు నగదు బహుమతి , అవార్డు గ్రహీతలకు ప్రశంస పత్రాన్ని లోక్ భవన్ హైదరాబాద్ నందు ఇచ్చి గవర్నర్ సత్కరించారు.ఈ అవార్డు ను రాందేవ్ రావు ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ కే కమలాకర్ అందుకున్నారు.ఈ కార్యక్రమంలో అధికార పార్టీ కార్యకర్తలతో పాటు బీజేపీ, బీఆర్ఎస్,ఐఏఎస్, ఐపీస్, విదేశీ రాయభారులు, స్వతంత్ర సమరయోధులు , స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, రాష్ట మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు ,అడలూరి లక్ష్మన్, మాజీ గవర్నర్ బండారు దత్తత్రేయ, ఎంపీ ఈటెల రాజేందర్, ప్రభుత్వ ప్రధాన సలహాదారులు, కె కేశవరావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ రమణ, డి శ్రవణ్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు, డీజీపీ శ్రీధర్ రెడ్డి పలువురు హాజరయ్యారు. అనంతరం మంగళవారం రాందేవ్ రావు ఆసుపత్రి మేనేజ్ మెంట్ అభినందన కార్యక్రమం నిర్వహించి ఉద్యోగులనందర్నీ అభినందించింది ఈ అవార్డు ద్వారా రాందేవ్ రావు ఆసుపత్రి బాధ్యత సమాజం లో మరింత పెరిగిందని, రోగులను మరింత జాగ్రత్తగా, భద్రంగా, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి యజమాన్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి యజమాన్యం రంతిదేవ్ రావు, మీరా రావు, విక్రందేవ్ రావు, జ్యోతి రావు, విజయలక్ష్మి,పృథ్వీరెడ్డి, భారతి రెడ్డి,విష్ణువర్ధన్ రెడ్డి , ప్రశాంత్ రెడ్డి, అపర్ణ రావు,జీవి రమణ తెలిపారు. ఈ కార్యక్రమం లో సీఈఓ డాక్టర్ యోబు, డాక్టర్స్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీస్ విధుల కేటాయింపులో ఏఐ వినియోగం

**- మానవ ప్రమేయం లేకుండానే పూర్తి పారదర్శకత**

**- అత్యాధునిక 'జనరేటివ్ ఏఐ' విధానాన్ని ప్రారంభించిన సీపీ సజ్జనర్**

**హైదరాబాద్,అక్షర గళం:**

సాంకేతికత వినియోగంలో నగర పోలీసులు మరో ముందడుగు వేశారు. సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ (సీఏఆర్) సిబ్బంది విధుల కేటాయింపులో మానవ ప్రమేయం లేకుండా, పూర్తి పారదర్శకతతో కూడిన అత్యాధునిక 'జనరేటివ్ ఏఐ' విధానానికి శ్రీకారం చుట్టారు. బషీర్‌బాగ్ లోని పాత కమిషనర్ కార్యాలయంలో మంగళవారం నగర సీపీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ఉన్నతాధికారులతో కలిసి ఈ నూతన విధానాన్ని ప్రారంభించారు.

గతంలో మాన్యువల్ పద్ధతిలో విధుల కేటాయింపు వల్ల జాప్యం జరగడంతో.. సమయం చాలా వృథా అయ్యేంది. వాటికి చెక్ పెడుతూ.. కేవలం రెండు నెలల్లోనే ఈ కొత్త సాంకేతికతను హన్స ఈక్విటీ పార్ట్‌నర్స్ ఎల్ఎల్‌పీతో కలిసి జనరేటివ్ ఏఐ సాయంతో కొత్త విధానాన్ని ఉన్నతాధికారులు అభివృద్ధి చేశారు.

**ఈ విధానం ప్రత్యేకతలు ఇవే:**

'హంగేరియన్ మెథడ్' అనే సాంకేతిక పద్ధతి ద్వారా సిబ్బంది సీనియారిటీ, రిజర్వ్‌లో ఉన్న రోజులు, రివార్డులు, క్రమశిక్షణ, ఆరోగ్యం వంటి అంశాలను స్కోర్ ఆధారంగా పరిగణనలోకి తీసుకొని కంప్యూటరే విధులను ఖరారు చేస్తుంది. ఇందులో అధికారుల జోక్యం అస్సలు ఉండదు.

ఓపెన్ ఏఐ సాయంతో డ్యూటీ అలాట్‌మెంట్ ఆర్డర్‌లు క్షణాల్లో తయారవుతాయి. దీనివల్ల ఆఫీసు పనిభారం తగ్గి, పోలీసులు శాంతిభద్రతలపై మరింత దృష్టి పెట్టవచ్చు.

ఉద్యోగుల సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రత్యేక 'ఏఐ చాట్ బాట్' అందుబాటులో ఉంటుంది. డ్యూటీ అలాట్‌మెంట్ కు సంబంధించిన అన్ని విషయాలకు చాట్ బాట్ సమాధానం ఇస్తుంది.

ఈ విధానం ద్వారా పైలట్ ప్రాజెక్ట్ కింద 1,796 దరఖాస్తులను పరిశీలించి.. సెక్రటేరియట్, సీఎం ఆఫీస్, ట్రాఫిక్ తదితర విభాగాలతో




పాటు ఇంటర్‌సెప్టర్ వాహనాలకు సంబంధించిన 208 డ్యూటీలను సమర్థంగా కేటాయించడం జరిగింది.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నగర సీపీ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ.. పోలీస్ సిబ్బందికి విధుల కేటాయింపును పారదర్శకంగా, జవాబుదారీతనంతో మార్చడం కోసమే అత్యాధునిక 'జనరేటివ్ ఏఐ' విధానాన్ని ప్రారంభించామని తెలిపారు. ఈ విధాన రూపకల్పనలో కీలకపాత్ర పోషించిన హన్స ఈక్విటీ పార్ట్‌నర్స్ ఎల్ఎల్‌పీకి చెందిన త్రినాథ బాబు, సునీల్ రేగులని ఈ సందర్భంగా అభినందించారు.

సాంకేతికత ద్వారా పోస్టింగుల్లో అపోహలకు, అసంతృప్తికి తావులేకుండా చూస్తున్నామని, దీనివల్ల సిబ్బందిపై మానసిక ఒత్తిడి తగ్గి విధుల్లో మరింత ఉత్సాహంగా పనిచేస్తారని పేర్కొన్నారు. ఈ విధానాన్ని ప్రతి ఒక్కరు ఈ విధానాన్ని వినియోగించుకుని.. డ్యూటీ అలాట్ మెంట్ ఆర్డర్ లను పొందాలని ఆదేశించారు. ఏఐ చాట్ బాట్ లో డ్యూటీ కేటాయింపునకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు.

ఈ సమావేశంలో సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ పోలీస్ కానిస్టేబుళ్లకు జనరేటివ్ ఏఐ విధానం ద్వారా జారీ చేసిన డ్యూటీ అలాట్‌మెంట్ ఆర్డర్లను వారికి అందజేశారు. ఈ సమావేశంలో అదనపు సీపీలు ఎం.శ్రీనివాస్, తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సీపీలు డి. జోయల్ డేవిస్, శ్వేత, , డీసీపీ, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఆర్.వెంకటేశ్వర్లు తో పాటు అన్ని జోన్లు, విభాగాల డీసీపీలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వందేమాతరం ఓ దివ్య మంత్రం

**- ఆర్ఎస్ఎస్ క్షేత్ర సేవా ప్రముఖ్ ఎక్కా చంద్రశేఖర్**

**హైదరాబాద్,అక్షర గళం:** స్వాతంత్ర్య పోరాటంలో వందేమాతరం నినాదం ఓ మంత్రంలా పనిచేసిందని ఆర్ఎస్ఎస్ క్షేత్ర సేవా ప్రముఖ్ ఎక్కా చంద్రశేఖర్ అన్నారు. నల్లకుంట్ల నిత్య జనగణమన వేదికలో మంగళవారం నిర్వహించిన వందేమాతరం దీక్ష విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనేక మంది స్వాతంత్ర్య సమరయోధులు వందేమాతరం నినాదాన్ని జపిస్తూ ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. సుమారు నూరయాభై సంవత్సరాల క్రితం పుట్టిన ఈ నినాదం ప్రజల్లో దేశభక్తిని రగిలించి స్వతంత్ర సమరయోధులుగా మార్చిందన్నారు. భారత స్వేచ్ఛ సాధనలో వందేమాతరం కీలక పాత్ర పోషించిందని చెప్పారు. అదే స్ఫూర్తితో ఆధునిక వందేమాతరం ఉద్యమంగా దీక్షను చేపట్టడం అభినందనీయమన్నారు. రెండు వేల రెండు మే ఏడవ తేదీన ప్రారంభమైన నిత్య జనగణమన కార్యక్రమం నేటికి వెయ్యి మూడు వందల అరవై ఒక రోజులు నిరంతరంగా జెండా అవిష్కరణ జరగడం విశేషమన్నారు. వందేమాతరం దీక్ష వ్యవస్థాపకులు చెన్నూరి నాగ శ్రీధర్ శర్మ నేతృత్వంలో దేశవ్యాప్తంగా దేశభక్తిని పెంపొందించే ప్రయత్నాలు ప్రశంసనీయమని తెలిపారు. ఈ కార్యక్రమాలు పౌరుల్లో దేశభక్తి స్ఫూర్తిని నింపుతాయన్నారు. అనంతరం వందేమాతరం దీక్ష పాటించిన పదహారు మంది సామాజిక కార్యకర్తల దీక్షను ఆయన విరమింపజేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా తొలిసారిగా ఈ విధమైన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో వందేమాతరం దీక్షను మరిన్ని ప్రాంతాలకు విస్తరించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నిత్య జనగణమన నిర్వాహకులు ఎం కే శ్రీని వాస్,




ఉపేందర్ ప్రసాద్ దూబే, డీ ఎన్ రావు, దుబా సి ప్రతిభ, మిర్చి డెవలపర్స్ డైరెక్టర్ జీ.ఓంకారేశ్వర్, మోతీ నగర్ బీజేపీ సీనియర్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, సామాజిక కార్యకర్తలు దేవండ్ల వెంకట రాము, పెబ్బేటి కృష్ణ, బాల్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, నడిగోటి సైదులు, వెంకటేష్ .నవీన్, అనీల్‌కుమార్‌లు దీక్ష విరమించి వందేమాతరం అంటూ నినాదాలు చేశారు.

# అతిథిగా పిలిచి అవమానించారు....

**ఏబీఎన్ డిబేట్ ఘటనపై మండలి చైర్మన్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్సీల ఫిర్యాదు**


**హైదరాబాద్,అక్షర గళం:**

ఏబీఎన్ డిబేట్‌లో తనకు జరిగిన అవమానంపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదన చారి నేతృత్వంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు చైర్మన్‌ను కలిశారు.




ఈ సందర్భంగా మధుసూదన చారి మాట్లాడుతూ, శాసనమండలి సభ్యుడిని డిబేట్‌కు పిలిచి అవమానించడం తీవ్రంగా ఖండనీయమన్నారు. బీఆర్ఎస్‌పై కుట్రతో వ్యాఖ్యాత వ్యవహరించి, ఎమ్మెల్సీ రవీందర్ రావుపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. ఇది వ్యక్తిగత దాడి కాకుండా శాసనమండలి సభ్యులపై జరిగిన దాడిగా భావించి చర్యలు తీసుకోవాలని చైర్మన్‌ను కోరినట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు ఉంటాయని ఆశిస్తున్నట్లు చెప్పారు.

ఎమ్మెల్సీ రవీందర్ రావు మాట్లాడుతూ, డిబేట్‌లో జరగని విషయాలు జరిగినట్లుగా చూపించే ప్రయత్నం చేశారని, దాన్ని తాను అడ్డుకున్నా నన్నారు. పార్టీ నేతలపై బురదజల్లే ప్రయత్నం జరిగిందని విమర్శించారు.



అతిథిగా పిలిచి అవమానించడం తనను బాధించిందని, తాను ఎక్కడా అన్‌పార్లమెంటరీ పదాలు ఉపయోగించలేదన్నారు. తనపై జరిగిన అవమానానికి పార్టీ, తెలంగాణ ప్రజలు అండగా నిలిచారని తెలిపారు. దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఏబీఎన్ చానల్ మొదటినుంచి తెలంగాణ వ్యతిరేక ధోరణి ప్రదర్శిస్తోందని ఆరోపించారు. డిబేట్ పేరుతో దురహంకారంగా వ్యవహరించడం ఖండనీయమని, ఇది ఒక్క ఎమ్మెల్సీకి జరిగిన అవమానం కాకుండా శాసనమండలి సభ్యులందరికీ జరిగిన అవమానంగా భావించాలని చైర్మన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీలు ఎల్. రమణ, నవీన్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

# బహిరంగంగా వెళ్తే రహస్యం ఎలా అవుతుంది?

- **మంత్రుల భేటీపై సోషల్ మీడియా, కొన్ని ప్రసార మాధ్యమాల్లో 'విష ప్రచారం'**
- **లోక్ భవన్ నుంచి అందరి ముందే ఒకే కారులో వెళ్ళాం.. ఇందులో దాపరికాలు లేవు.**
- **క్యాబినెట్ అనేది ఒక యూనిట్.... పాలనను సమన్వయం చేసుకోవడం మా బాధ్యత**
- **మా భేటీలో ప్రధాన చర్చ మున్సిపల్ ఎన్నికల సన్నద్ధత పైనే**
- **మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**



**హైదరాబాద్,అక్షర గళం:** "ప్రజాస్వామ్యంలో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తుల మధ్య జరిగే ప్రతి చర్చకు రాజకీయాలను ఆపాదిస్తూ "రహస్య భేటీ" అంటూ విష ప్రచారం చేయడం తగదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మంత్రుల భేటీపై సోషల్ మీడియా, ప్రసార మాధ్యమాల్లో జరుగుతున్న అసత్య ప్రచారాన్ని మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు.

రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందేందుకే కొందరు కావాలనే పని గట్టుకొని ఇలాంటి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. "ప్రజాస్వామ్యంలో క్యాబినెట్ అనేది ఒక యూనిట్. పాలనాపరమైన అంశాల్లో ఎక్కడా జాప్యం ఏర్పడకుండా ఉండటానికి సీనియర్ మంత్రులుగా మేం చర్చించుకుంటే అందులో తప్పేముంది... ? అది ప్రభుత్వ సమష్టి బాధ్యత. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నివాసంలో మేము భేటీ అయ్యి పాలనాపరమైన అంశాలను చర్చించాం" అని స్పష్టం చేశారు. "లోక్ భవన్ లో ఎట్ హోమ్ కార్యక్రమం ముగిసిన తర్వాత అందరి ముందే మేమంతా ఒకే కారులో వెళ్లాం. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ తరపున అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించాం. ప్రజాస్వామ్యంలో ఎన్నికల సన్నద్ధత అనేది రాజకీయ పార్టీల ప్రాథమిక బాధ్యత. దీనికి కూడా లేనిపోని రంగులు పూయడం సమంజసం కాదు" అని అన్నారు.

"నిర్మాణాత్మకమైన విమర్శలను మేము ఎప్పుడూ స్వాగతిస్తాం. కానీ వ్యక్తిత్వ హననానికి, ఊహాజనిత కథనాలకు పాల్పడితే అది ప్రజాస్వామ్యానికే ప్రమాదకరం. రాష్ట్రాభివృద్ధి కోసం... భావితరాల భవిష్యత్తు కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తున్న మా ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేయడం ఇకనైనా మానుకొని రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి" అని కోరారు.

# సంపాదకీయం..

## మేడారం.. ఓ మహా జనజాతర!


తెలంగాణలో జాతరలకు ప్రత్యేక స్థానం ఉంది. చిన్నాచితకా జాతర్లను ప్రతీ గ్రామంలోనూ..ఆయా ప్రాంతాల్లోనూ చూస్తుంటాం. జాతరలో అనేక రకాల దేవతలను స్మరించుకుంటుంటారు. ఒక్కో జాతర ఒక్కో లక్ష్యంగా సాగుతుంది. స్థానిక దేవతులకు మొక్కులు చెల్లించుకునే జాతరలు ఈ ప్రాంతంలో కోకొల్లు. కొమురవెల్లి, కొత్తకొండ.. కొండపోచమ్మ...ఇలా అనేక జాతరలు ప్రసిద్ది చెందాయి. ఆంధ్రప్రదేశ్‌లో కూడా అనేక జాతరలు సాగుతుంటాయి. అయితే ఇవన్నీ ఒక ఎత్తయితే..మేడారం జాతర మరో ఎత్తు. కేవలం గిరిజన సంప్రదాయాలకే పరిమతమైన ఈ జాతర ఇప్పుడు సర్వజనావళి ఆమోదంగా మారింది. ఇక్కడి సమ్మక్క-సారలమ్మకు మొక్కులు చెల్లించుకోవడం కోసం



గిరిజనేతులరే ఎక్కువగా వస్తున్నారు. గద్దెలను దర్శించుకోవడం, బంగారం సమర్పించుకోవడం..మొక్కులు చెల్లించుకోవడం వంటివన్నీ గిరిజన సంప్రదాయంలో సాగినా...అందరినీ ఆకట్టుకునే, ఆకర్షించే జారతగా మేడారం మారింది. అలాగే జాతర నాలుగు రోజులు కోట్ల రూపాయల వ్యాపారం కూడా సాగుతుంది. సామాన్య వ్యాపారులకు ఇక్కడ బతుకు సాగుతుంది. మొత్తంగా మేడారం... జనజాతరకు రంగం సిద్దం అయ్యింది. రెండేళ్ల కోమారు జరిగే జాతర కోసం ప్రజలు కళ్లల్లో వత్తులు వేసుకుని చూస్తుంటారు. అమ్మవార్లను దర్శించుకోవడం ఆయనవాయితీగా పెట్టుకున్నవారికి మేడారం జాతర ఓ మహాపండగ. కుటుంబాలతో కలసి అమ్మవారి గద్దెలను దర్శించుకుని, మొక్కులు చెల్లించుకోవడం..తృప్తిగా ఇంటికి రావడంతో మనసు పులకించి పోతుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఓ మారుమూల గ్రామం మేడారం ఇవాళ ప్రపంచ వ్యాప్తంగా తలెత్తుకుని చూసేలా సిద్దం అయ్యింది. నిజానికి మేడారం పేరులోనే ఒక మహత్తు ఉందేమో అనిపిస్తుంది. ఎందుకంటే ఈ పేరు చెప్పగానే గిరిజనులు సహా, ఇక్కడికి వచ్చే భక్తులు పులకించి పోతారు. కొత్త చైతన్యం కానవస్తుంది. అమ్మవారిని దర్శించుకోగానే సరికొత్త జీవితంలోకి అడుగు పెడుతుంటారు. అంతా అమ్మదయ అన్న ధీమాతో జీవనాయనం సాగిస్తుంటారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి జరిగే ఈ జాతర నిర్వహణ జిల్లా పాలనా యంత్రాంగానికి ఒక పెద్ద సవాల్ లాంటిదే. అయితే వారు కూడా అలవోకగా ఈ జారతను నిర్వహిస్తుంటారు. అందుకు అమ్మదయ కూడా కారణం కావచ్చు. దాదాపు కోటి మందికి పైగా గిరిజనులు, గిరిజనేతరులు హాజరయ్యే ఈ జాతర గిరిజన సంస్కృతీ, సాంప్రదాయాలను ఇప్పటికీ పాటిస్తూ ప్రత్యేకంగా నిలిచింది. ఒక అటవీ కుగ్రామంలో మౌలిక సదుపాయాలు అంతంతమాత్రంగానే ఉన్న ప్రాంతంలో జరిగే ఈ జాతరను గిరిజన కుంభమేళాగా అభివర్ణిస్తారు. ఈ జాతరకు హాజరయ్యే భక్తజన కోటి ఏయేటికాయేడు పెరుగుతందే తప్ప తగ్గడం లేదు. కేవలం ఆ తల్లుల దర్శనం చేసుకుంటే చాలు తమ కష్టాలు మాయం అవుతాయన్న భరోసాతో భక్తులు వస్తుంటారు.అందుకే ఏటేటా భక్తుల రాక పెరుగుతోంది. ఎంతోమంది ఎడ్ల బండ్లలో మేడారానికి వచ్చి కనీసం మూడు రోజులు బస చేస్తారు. ఇక్కడే వంటావార్పు చేసుకుని తమ జీవితం ధన్యమయ్యిందని భావిస్తారు. మతాలు, దేశాలు, పద్ధతులు వేరైనా సరే జాతరలు సహజంగా జరిగేవే. కానీ, ఏ జాతరకూ లేని ప్రత్యేకతలు, ఏ జాతరలోనూ కనిపించని విశిష్టతలు మేడారంలో కనిపిస్తాయి. గలగల పారే సంపంగివాగులో పుణ్యస్నానాలు చేసే కుంభమేళా లాంటి దృశ్యాలు ఇక్కడా కనిపిస్తాయి. గణగణ మోగే గంటలు హిందూ దేవాలయాల వాతావరణాన్ని ప్రతిధ్వనిస్తాయి. కొండకోనల మధ్య జనసందోహం శబరిమలను తలపిస్తుంది. తలనీలాలు సమర్పించుకుని మొక్కులు చెల్లించే మరో తిరుమల ప్రత్యక్ష మవుతుంది. ఈ జాతర కేవలం కోయల సంప్రదాయాలను గౌరవించడం, గుర్తించడం వరకు మాత్రమే పరిమితం కాదు. నమ్మిన జనం కోసం ప్రాణమైనా ఇవ్వాలనే ఓ సందేశం కూడా అంతర్లీనంగా ఉంటుంది.

యుద్ధంలో గెలిచిన కాకతీయులు సామ్రాజ్యాన్ని విస్తరించుకుని చక్రవర్తులయ్యారు. పోరాటం చేసిన మేడరాజులు మాత్రం దేవుళ్లు అయ్యారు. అయితే ఇక్కడికి వచ్చే వారెవ్వరూ గత చరిత్రలోకి వెళ్లరు. అమమవార్లపై ఉన్న నమ్మకంతో మొక్కులు చెల్లించుకుంటారు. మళ్లీమళ్లీ వస్తామని మొక్కుకుంటారు.

మేడారం మహా జాతరకు అందుకే భక్తులు పోటెత్తుతారు. సమ్మక్క, సారలమ్మ దర్శనం కోసం లక్షలాదిగా తరలివస్తుంటారు. వరాలిచ్చే దేవతలుగా వెలుగొందుతున్న తల్లులను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. జాతర పరిసరాలు కిక్కిరిసిపోయిన, దర్శనం అవుతుందా కాదా అన్న సందేహం లేకుండా ముందుకు సాగుతుంటారు. మేడారం-పస్రా, మేడారం-తాడ్వాయి రహదారుల వెంట చెట్లకింద భక్తులు విడిది చేయడం ఆనవాయితీ. ప్రకృతి ఒడిలో వంటలు చేసుకొని విందు భోజనాలు చేస్తూ ఇళ్లకు తిరుగు ప్రయాణమవుతుంటారు. గుడిలో దేవుడు..పూజారి, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పొర్లు దండాలు వంటివన్నీ ఏవీ లేని ఈ జాతర తెలంగాణ జాతరల్లో ప్రత్యేకంగా నిలిచిపోతుంది. కోటానుకోట్ల మందికి ఆర్థ్య దైవంగా సమ్మకక్క-సారలమల్మ జాతర నాలుగు రోజులు రంజుగా సాగనుంది.



## మేడరాం జాతరలో కీలకంగా వైద్య సేవలు

### 50పడకల అస్పత్రితో ఏర్పాటు

### - ప్రత్యేకంగా 30 హెల్త్ క్యాంపులు

మేడారం జాతరలో వైద్యశాఖ సేవలు కీలకంగా మారాయి.ఈసారి 50పడకల అస్పత్రితో పాటు ప్రత్యేకంగా 30 హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేశారు. 5,192మంది మెడికల్, పారా మెడికల్ సిబ్బందిని నియమించారు. జాతర సమయంలో 24గంటలు సేవలు అందించేందుకు వైద్య, ఆరోగ్యశాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. 649మంది వైద్యాధికారులు, 154మంది ఆయుష్ వైద్యాధికారులు, 673మంది నర్సింగ్ అధికారులు, 1,905మంది ఆశ వర్కర్లు, 1,111మంది పారా మెడికల్ సిబ్బంది, 331మంది సూపర్‌వైజరిస్టాఫ్, 700మంది ఇతర సిబ్బదిని నియమించారు.

జాతర అనంతరం కూ డా వ్యాధులు ప్రబలకుండా 10మెడికల్ క్యాంపులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటితో పాటు ములు గు జిల్లా అస్పత్రి, ఏటూరునాగారం ఏరియా అస్పత్రిల్లో వైద్య సేవలు అందేలా ఏర్పాట్లు చేస్తున్నారు. 108 వాహనాలను 15 అందుబాటులో ఉంచుతున్నారు. మరో 15 మొబై ల్ అంబులెన్స్‌లను కూడా జాతరకు తరలిస్తున్నారు.

# మేడారంలో ట్రాఫిక్ సమస్యలకు చెక్

## పలు రూట్లలో రహదారుల విస్తరణ - ట్రాఫిక్ నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీరణకు పెద్దపీట



మేడారం జాతరకు లక్షలాది వాహనాల్లో తరలివస్తుండటంతో ట్రాఫిక్ నియంత్రణ సవాల్‌గానే ఉంటుంది. ఈ సమస్యను తగ్గించేందుకు ఈసారి మేడారానికి సమీపంలోని రోడ్లు.. వంతెనల విస్తరణకు ప్రాధాన్యమిచ్చారు. రూ.100 కోట్లు వెచ్చించి జాతీయ రహదారులు, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో 39 ప్రధాన రహదారులను అభివృద్ధి చేశారు. 10 రోడ్లు, మూడు కల్వర్టులను కొత్తగా నిర్మించారు. వాహనదారులకు ప్రయాణ సౌలభ్యం ఏర్పడనుంది. క్యూలైన్లలో



తోపులాటకు ఆస్కారం లేకుండా వెడల్పుగా శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సౌకర్యం, గద్దెల దర్శనం సందర్భంలో తోపులాట నివారణ, రద్దీ సందర్భాల్లో చోరీల కట్టడి అంశాలపై పోలీసుశాఖ భారీ కసరత్తు చేసింది. ట్రాఫిక్ నియంత్రణకు రూట్ మ్యాప్‌లను సిద్ధం చేసింది. 33 చోట్ల దాదాపు 1500 ఎకరాల్లో మూడు లక్షల వాహనాలు నిలిపేలా పార్కింగ్ స్థలాలను సిద్ధం చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ను వినియోగిస్తూ యాప్ ద్వారా ట్రాఫిక్ చిక్కులు, దర్శన సమయాల్లో రద్దీని నియంత్రించే చర్యలు చేపట్టనున్నారు. తప్పిపోయే అవకాశం ఉన్న పిల్లలు, వృద్ధులకు క్యూఆర్ కోడ్ ద్వారా జీపీఆర్ఎస్‌ను అనుసంధానం చేసి ఇట్టే గుర్తించే సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. సీసీ కెమెరాలు..ఫేస్ రికజ్నేషన్ స్టాఫ్ట్‌వేర్‌తో దొంగలను పట్టుకొనేందుకు సీసీఎస్, షీటీమ్‌లు సన్నద్ధమయ్యాయి. జాతరకు ఆర్టీసీ విశాలమైన ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. 4 వేల బస్సులను ప్రయాణికులను తరలించేం దుకు సిద్ధంగా ఉంచింది. ఈ నెల 31 వరకు మొత్తంగా 20 లక్షల మంది ప్రయాణిస్తారని అంచనా వేస్తోంది. మహిళలకు ఉచిత ప్రయాణ పథకం వర్తింపజేశారు. జాతర భక్తులకు జంపన్నవాగు వద్ద సౌకర్యాలు ఆధునికీకరించారు. ఘాట్లు మరమ్మతులు చేశారు. బావుల్లో పూడిక తీసి.. మోటార్లతో వాగులోకి నీరు ఎత్తుపోసే ఏర్పాట్లు చేశారు. స్నానాల అనంతరం దుస్తులు మార్చుకోవటానికి మహిళలకు షెడ్లు సిద్ధంగా ఉంచారు. ప్రమాదాల నివారణకు 350 మంది ఈతగాళ్లను సిద్ధంగా ఉంచనున్నారు. జాతరలో వంటల సందర్భంలో ప్రమాదాల నివారణకు 268 మంది అగ్నిమాపక సిబ్బంది శకటాలతో సిద్ధంగా ఉన్నారు.

# ఏకాప్రణాళికతో పోలీస్ శాఖ సన్నద్ధం

### జాతర కోసం విధుల్లో 13వేల మంది పోలీసులు

### డ్రోన్లు, ఎఐ సహకారంతో శాంతిభద్రతల నిర్వహణ

విధుల్లో ఉమ్మడి జిల్లా ఎస్పీలు, ఎసీపీలు, డీసీపీలు, డీఎస్పీలు మేడారం జాతరలో అత్యంత కీలకమైనది పోలీస్ శాఖనే. ట్రాఫిక్‌తో పాటు శాంతిభద్రతల భారం ఆ శాఖపైనే ఉండటంతో పోలీసులు అత్యాధునిక టెక్నాలజీని వాడుతున్నారు. జాతరలో 13వేల మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఎస్పీలు, ఎసీపీలు, డీసీపీలు, డీఎస్పీలు కూడా విధుల్లో చేరుతున్నారు. బుధవారం నుంచి నాలుగు రోజులపాటు మేడారం మహాజాతర ఘనంగా జరగనుంది. లక్షలాదిగా వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం 8 జోన్లు, 42 సెక్టర్లుగా జాతరను విభజించి విస్తృతంగా ఏర్పాట్లు చేసింది. 21 శాఖలకు చెందిన 42,027 మందికి పైగా ఉద్యోగులు, సిబ్బంది మేడారంలో విధులు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా జాతరలో ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులు ఏఐ సహకారంతో అత్యాధునిక డ్రోన్లు, సీసీ కెమెరాలతో సన్నద్ధం అవుతున్నారు. అలాగే 20 లక్షల మంది భక్తులను సురక్షితంగా జాతరకు చేర్చేందుకు ఆర్టీసీ కార్యాచరణ రూపొందించింది. భక్తులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వైద్య, ఆరోగ్యశాఖతో పాటు నీటిపారుదలశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ తదిరత శాఖలన్నీ కూడా సిద్ధమయ్యాయి. భక్తులకు సెల్ సిగ్నల్స్ సమస్య ఉత్పన్నం కాకుండా భారీగా మొబైల్స్ టవర్లు ఏర్పాటు చేస్తున్నారు. గత జాతరలో సుమారు 30వేల మంది భక్తులు తప్పి పోయిన నేపథ్యంలో ఈసారి జియోట్యాగ్ బెస్ట్ మిస్సింగ్ పర్సన్స్ ట్రాకింగ్ వ్యవస్థను తీసుకవచ్చారు. వృద్ధులు, పిల్లలకు పస్రా, తాడ్వాయి మార్గాల్లో క్యూఆర్ కోడ్ గల జియోట్యాగ్‌లను కడుతారు. దీంతో ఎవరైనా తప్పిపోయినా ఈ ట్యాగ్‌ను స్కాన్ చేస్తే వివరాలు తెలిసిపోతాయి. శబరిమలలో విజయవంతమైన ఈ విధానాన్ని ప్రస్తుతం మేడారంలో అమలు చేస్తున్నారు. అలాగే శాంతిభద్రతలను దృష్టిలో పెట్టుకుని 12క్రైమ్ బృందాలను ఏర్పాటు చేశారు. అలాగే పాత నేరస్తులను గుర్తించేందుకు అస్పత్రి ప్రాంగణాలు, పార్కింగ్ ప్రాంతాల్లో ఫేస్ రికగ్నిషన్ సాంకేతికతను వినియోగిస్తున్నారు. అపుమానస్పద వస్తువులను గుర్తించే రియల్ టైమ్ అలర్ట్ సిస్టమ్‌ను కూడా సిద్ధం చేశారు. అలాగే టీజీ క్వెస్ట్ అత్యాధునిక ఏఐ డ్రోన్ వ్యవస్థను జాతరలో వినియోగిస్తున్నారు.





శాంతిభద్రతల పరిరక్షణ, ఎవరు తప్పిపోకుండా, సురక్షిత జాతర లక్ష్యంగా ఏఐ డ్రోన్లు జాతరలో గస్తీ నిర్వహించ నున్నాయి. అలాగే జాతరలో 450 సీసీ కెమెరాలు, 20 డిస్‌ప్లే ప్యానల్స్ వినియోగిస్తున్నారు.

కౌడ్ కౌంటింగ్ కెమెరాలు, ఫెస్ రికగ్ననైజేషన్ కెమెరాలను కూడా క్యూలైన్‌లు, అధికంగా భక్తులు ఉండే ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నారు. అలాగే 42 పార్కింగ్ స్థలాలు, 37 హోల్డింగ్ పాయింట్లను ఏర్పాటు చేశారు. వరంగల్ నుంచి పస్రా వరకు నాలుగు కిలో మీటర్లకు ఒకటి చొప్పున పోలీస్ ఔట్ పోస్టులను ఏర్పాటు చేశారు. అలాగే పస్రా నుంచి మేడారం వరకు రెండు కిలో మీటర్లకు ఒకటి చొప్పున పోలీస్ ఔట్‌పోస్టులను ఏర్పాటు చేశారు. అలాగే మొబైల్ పెట్రోలింగ్ టీమ్‌లు, మఫ్టీ టీమ్‌లను కూడా ఏర్పాటు చేశారు. 11 క్రేన్లు, 20 జేసీబీలను కూడా సిద్ధంగా ఉంచారు.

ములుగు ఎస్పీ సంగ్రామ్‌సింగ్ పాటిల్ నేతృత్వంలో పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు.

## ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో తనిఖీలు

### 50వేలకు మించి నగదు ఉంటే రసీదు ఉండాలి

### ఏడీజీ మహేష్ భగవత్ వెల్లడి

హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తక్షణమే రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. అక్రమాలను అరికట్టేందుకు ప్లయింగ్ స్క్వాడ్లు రంగంలోకి దిగాయని ఏడీజీ మహేష్ భగవత్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నగదు రవాణాపై పోలీసులు కఠిన నిబంధనలు విధించారు.. ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో వ్యక్తులు గరిష్టంగా 50,000 వరకు మాత్రమే నగదును వెంట తీసుకెళ్లాలి. రూ.50,000 కంటే ఎక్కువ నగదు ఉంటే తప్పనిసరిగా సరైన ఆధారాలు చూపించాలి, లేని పక్షంలో ఆ నగదును సీజ్ చేస్తారు. పోలీసులు నగదు లేదా ఇతర వస్తువులను సీజ్ చేసినప్పుడు తప్పనిసరిగా రిసీట్ ఇస్తారు. దానిపైనే అప్పీల్ చేసుకునే వివరాలు కూడా ఉంటాయి. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ



భారీ ఏర్పాట్లు చేస్తోంది. తెలంగాణ పోలీసులతో పాటు ఫారెస్ట్ , ఎక్సైజ్ శాఖల నుంచి సుమారు 2,000 మంది అదనపు సిబ్బందిని వినియోగిస్తున్నారు. పారదర్శకత కోసం అన్ని పోలింగ్ కేంద్రాల్లో 100శాతంవెబ్ కాస్టింగ్ నిర్వహించాలని నిర్ణయించారు. హైపర్ సెన్సిటివ్ , క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలతో నిఘా ఉంచుతారు. రౌడీ షీటర్లను బైండోవర్ చేసే పక్రియ ప్రారంభమైంది. ఓటర్లందరూ ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా, నిర్భయంగా వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల కమిషన్ , పోలీస్ శాఖ విజ్ఞప్తి చేశాయి.

## ఈయేడు 600 హుండీల ఏర్పాటు

### డిజిటల్ చెల్లింపులకు సైతం అవకాశం

మేడారం సమ్మక్క సారలమ్మ జాతరలో భక్తులు వేసే కానుకల కోసం ఈసారి 600 హుండీలను ఏర్పాటు చేస్తున్నారు. గత జాతరలో 470 హుండీలను ఏర్పాటు చేశారు. వనదేవతల గద్దెల ప్రాంగణం పెరగడంతో ఆ మేరకు హుండీల సంఖ్యను పెంచాలనే నిర్ణయాన్ని తీసుకున్నారు. వీటికి పోలీసు శాఖ కూడా అనుమతి ఇచ్చింది. ఇది వరకు సమ్మక్క, సారలమ్మ జాతర గ్దదెల ప్రాంగణం చిన్నదిగా ఉండేది. జాతర జరిగిన మూడు రోజులు భక్తులతో క్రిక్కిరిసి పోయేది. దీనితో హుండీలను ఏర్పాటు చేయడానికి చాలినంత స్థలం ఉండేది కాదు. ఈ సారి అలాంటి పరిస్థితి ఉండదు. రూ101 కోట్ల వ్యయంతో తల్లుల గద్దెలను ఆధునీకరించారు. గ్దదెల ప్రాంగణాలను గతంలో కన్నా విస్తరించారు. శిలాస్థంభాలతో సుందరీకరించారు. ఈ దృష్ట్యా ఈ సారి హుండీలను 600 వరకు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గత జాతర వరకు భక్తులు తమ కానుకల ను హుండీలో మాత్రమే వేసే అవకాశం ఉం డేది. ఈసారి డిజిటల్ పేమెంట్ల అవకాశం కల్పించారు. జాతర ప్రాంగణంలో క్యూఆర్ కోడ్‌లను అందుబాటులో ఉంచారు. భక్తులు స్కాన్ చేసి తమ కానుకలను నగుదు రూపంలో ఫోన్ ద్వారా చెల్లించవచ్చు. దీంతో సాంప్రదాయిక గిరిజన జాతర ఆధునికతను సంతరించుకున్నట్లయింది.

మేడారం జాతర అంటే బంగారం (బెల్లం). జాతర వచ్చిందంటే బెల్లం కొనుగోళ్లు జోరుగా సాగుతాయి. కోరిన కోర్కెలు నెరవేరితే నిలువెత్తు బంగారం ఇస్తామని మొక్కుకోవడం ఆనవాయితీ. తులాభారం వేసి నిలువెత్తు బంగారాన్ని తల్లులకు సమర్పించేవారు. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. భక్తులు నిలువెత్తు బంగారం



చెల్లిస్తామన్న మొక్కును చెల్లించుకుంటున్నారు కానీ అదిపూర్తిగా బెల్లం రూపంలో కాదు. భక్తు లు ఇది వరకటిలా తమ బరువును బట్టి తూగే బెల్లాన్ని మొత్తంగా కొనడంలేదు. మొత్తం బరు వులో తూగే బెల్లంలో ఒకటింట మూడో వంతు బెల్లం కొని మిగతా మొత్తాన్ని ఆ విలువ మేర కు నగదు రూపంలో హుండీలో వేస్తున్నారు. దీని వల్ల బెల్లాన్ని గ్దదెల వరకు మోసుకు వెళ్లే శ్రమ తగ్గడమే కాకుండా అంత బెల్లాన్ని పంచిపెట్టడంలో ఎదురయ్యే ఇబ్బందులు కూడా తొలుగుతున్నాయి. మరికొందరు భక్తులు బెల్లం బదులు చెక్కెర కొనుగోలు చేస్తున్నారు.



## వేసవి తాపాన్ని తగ్గించే

# ప్రకృతి ప్రసాదాలు

రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగు తుండడంతో ప్రజలు అల్లాడుతున్నారు. రెండ్రోజులుగా వాతావరణం చల్లగా ఉన్నప్పటికీ ఉక్కపోత మాత్రం తగ్గలేదు. దీంతో ప్రజలు శీతలపానీయాల వైపు ఆసక్తి చూపారు. అయితే ఈ వేసవిలో కొబ్బరిబొండాలు, నిమ్మరసం, పండ్లు తీసుకుంటేనే మేలని వైద్యులు సూచిస్తున్నారు. శీతలపానీయాల వల్ల తాత్కాలిక చల్లదనం అనిపించినప్పటికీ అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం లేకపోలేదు. ఈ వేసవిలో అధికంగా కొబ్బరినీరు, నిమ్మరసంతో ఎండ వేడిని తరిమేయవచ్చని సూచిస్తున్నారు.



ఎండలు మండుతున్నాయి. ఎండలో తిరుగుతూ కాస్త పనులు చేసుకోవాలంటే శరీరానికి ఎం తో శక్తి అవసరం. శరీరం తిరిగి శక్తి పుంజుకుని వేసవిని చల్లగా మార్చుకునేందుకు కొబ్బరినీరు దివ్య ఔషధంగా పని చేస్తుంది. కొబ్బరినీరు ఆరో గ్యంతోపాటు సౌందర్య రక్షణకు ఎంతో మేలు చే స్తుంది. దీంతోపాటు వేసవి కాలంలో చలువకు పుచ్చకాయలు, చల్లటి నీటికోసం కుండలకు ఆదర ణ పెరుగుతోంది. మండే ఎండల్లో ఉష్ణతాపాన్ని తగ్గించుకుని ఉల్లాసంగా ఉండేం దుకు ప్రజలు వివిధ రకాల జాగ్రత్తలు పాటిస్తుంటారు. అందులో కొబ్బరిబొండాలు, పుచ్చకాయలు ముందుంటాయి. అయితే వేసవిలో కొబ్బరిబొండాలు, పుచ్చకాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఒక్కో కొబ్బరి బొండం రూ. 20 25గా ధర పలుకుతోంది. లీటరు కొబ్బరినీళ్లు రూ. 70నుంచి రూ.120వరకు విక్రయి స్తున్నారు. ఇక పుచ్చకాయలను కిలో రూ.20 చొప్పున విక్రయిస్తు న్నారు. ఇక పేదోడి ఫ్రిజ్ కుండలకు కూడా గిరాకీ పెరిగింది. ఒక్కో కుండ రూ.180, కూజాలను రూ. 150వరకు విక్రయిస్తు న్నారు. బత్తాయి, ఆపిల్, సపోట, పైనా పిల్, ద్రాక్ష, చెరుకు రసాన్ని గ్లాస్ ఒక్కింటికి రూ.20లు చొప్పున వ్యాపారులు విక్రయి స్తున్నారు. రానున్న రోజుల్లో ఎండలు పెరగడంతో ధరలు పెరిగే అవకాశముంది.

### కొబ్బరినీటిలో ఔషధగుణాలు

- కొబ్బరినీటిలో కొలెస్ట్రాల్ శాతం తక్కు వగా ఉంటుంది.
- తరచూ తాగడం వల్ల శరీరంలోని చక్కెర స్థాయిని అదుపులో ఉంటుంది.
- కొబ్బరినీళ్లలో సోడియం తక్కువగా ఉంటుంది గనుక వాటిని తాగితే అతిసారం, గుండె సంబంధిత సమస్యలు దూరమ వుతాయి.
- మొఖంపై మొటిమలు, నల్లటి మచ్చలు తగ్గాలంటే లేత కొబ్బరిగుజ్జును రాసుకుంటే ఫలితం వెంటనే తెలుస్తుంది.
- ప్రొటీన్ల లోపం ఉన్నవారికి కొబ్బరినీరు దివ్యౌషధంగా పనిచేస్తాయి.
- కొబ్బరినీటిలో పసుపు, గంధం కలిపి ఆ మిశ్రమాన్ని ముఖానికి రాసుకుంటే ము ఖం కాంతివంతంగా మెరిసిపోతుంది.
- కొబ్బరినీళ్లలో సుమారు 95శాతం నీళ్లు, కేవలం 2.8శాతం చక్కెర, 0.5శాతం వర కు లవణాలుంటాయి.
- ఫ్రక్టోజ్, సుక్రోజ్ అనేక పోషకపదార్థాలు ఉంటాయి. ఇవి ఆరోగ్యాన్ని స్తాయి.



## మూత్రపిండాల్లో రాళ్లకు

# హోమియో చికిత్స

మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడటం ఈ మధ్య కాలంలో చాలా మందిలో కనిపిస్తున్న సమస్య. ఒక సర్వే ప్రకారం భారత్‌లోని పురుషుల్లో 10.6 శాతం, స్త్రీలలో 7.1 శాతం ఈ సమస్యతో బాధపడుతున్నారని తేలింది. మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు, స్థూలకాయం వంటివి దీనికి ప్రధాన కారణాలు. మన శరీరం ఒక భారీ కర్మాగారం లాంటివి. ఇందులో నిరంతరం రకరకాల జీవక్రియలు జరుగుతుంటాయి. వీటిలో మూడు విసర్జక అవయవాలు కీలక పాత్ర పోషిస్తాయి. అవి మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, చర్మం. వీటిల్లో 90 శాతం మలినాలను విసర్జించేది మూత్రపిండాలే. కిడ్నీలు రక్తంలోని విష పదార్థాలను, అదనపు నీటిని క్రమంగా తొలగిస్తుంటాయి.

మన మూత్రపిండాలు రోజుకు 200 లీటర్ల రక్తాన్ని వడపోస్తాయి. నేటి ఆధునిక జీవన శైలిలో చాలామంది సరిపడా నీళ్లు కూడా తాగలేకపోతున్నారు. ఫలితంగా మూత్రపిండాల్లో రాళ్ల సమస్య పెరుగుతోంది. చాలా సందర్భాల్లో ఈ రాళ్లు చిన్నవిగా ఉండి, మూత్రంతో విసర్జింపబడతాయుయి. కొన్నిసార్లు రాళ్ల పరిమాణం పెద్దవిగా ఉండి, మూత్ర నాళాల్లో చిక్కుకుని తీవ్రమైన నొప్పి కలిగిస్తాయి.

### కారణాలు

అధిక బరువు, ద్రవపదార్థాలు సరిపడా తీసుకోక పోవడం
మూత్రావయవాల్లో వచ్చే ఇన్‌ఫెక్షన్
జన్యుపరమైన ఇన్‌ఫెకన్లు
ఎక్కువగా వేడి వాతావరణంలో ఉండటం
వంశపారంపర్యం కొన్ని రకాల మందుల వాడకం

### లక్షణాలు

పొత్తి కడుపులో తీవ్రమైన నొప్పి
నీరసం, వికారం, తీవ్రమైన జ్వరం
మూత్రంలో రక్తం పడటం (దీన్ని హిమచ్యూరియా అంటారు)
మూత్రంలో మంట, చీము రావడం

### జాగ్రత్తలు

నీటిని ఎక్కువగా తాగాలి. కనీసం రోజుకు 4 లీటర్ల ద్రవ పదార్థాలు తీసుకోవాలి.

కిడ్నీలో ఆక్సలేట్ రాళ్లు ఉంటే, ఆక్సలేట్ ఉండే పదార్థం, అంటే చాక్‌లెట్, పాలకూర, సోయా, ఎండు చిక్కుడు వంటివి తీసుకోకూడదు.

కాల్షియం సిట్రేట్‌కు కిడ్నీలో రాళ్లు ఏర్పడకుండా నివారించే లక్షణం ఉంది. కాబట్టి అవి శరీరానికి అందేలా ఆహార నియమాలు పాటించాలి.

కూల్‌డ్రింక్‌లను అసలు ముట్టుకోకూడదు.

### నిర్ధారణ పరీక్షలు

కిడ్నీ ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ స్కాన్, కిడ్నీ పరీక్ష
రక్త పరీక్ష, మూత్ర పరీక్ష

### హోమియో చికిత్స

హోమియోపతిలో శారీరక, మానసిక లక్షణాలను పరిగణనలోకి తీసుకుని ఎలాంటి సర్జరీ అవసరం లేకుండానే కిడ్నీలో రాళ్లు తొలగించవచ్చు. రాళ్ల పరిమాణం, అవి ఏ వైపు ఏర్పడ్డాయో వంటి వివరాల ఆధారంగా మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా బెరిబెరి వల్గరీస్, సరసపరిల్ల, కలెబారియకార్బ్, పెరిర బ్రావ, కొలొసింత్ మందులను డాక్టర్ పర్యవేక్షణలో వాడాలి.



# పసికందులు ఏడుస్తూనే ఉంటే.. ?

**ప్రశ్న:** మా బాబు వయసు నెల రోజులు. కానీ అందరు పిల్లల్లా పాలు తాగగానే పడుకోడు. ఏడుస్తూ ఉంటాడు. ఇలా రోజంతా ఎక్కువ సమయంపాటు ఏడుస్తూనే ఉంటాడు. రాత్రుళ్లు కొన్ని గంటలపాటే నిద్రపోతాడు. ఇది సహజమేనా, లేక బాబుకు ఏదైనా ఆరోగ్య సమస్య ఉందని అనుకోవాలా?

కొందరు పసికందులు చక్కగా పాలు తాగుతారు. నిద్ర పోతారు. ఆడుకుంటూ ఉంటారు. ఇంకొందరు ఇందుకు భిన్నంగా ఆ పనులన్నీ సక్రమంగా చేస్తూ కూడా ఆపకుండా ఏడుస్తూ ఉంటారు. ఇందుకు ఎన్నో కారణాలుంటాయి. పసికందులు ఆకలి వేసినప్పుడు, పక్క తడుపుకున్నప్పుడు, చీమలు మొదలైన పురుగులు కుట్టినప్పుడు, చీకాకు కలిగినప్పుడు, విసుగు పుట్టినప్పుడు, అమ్మ అటెన్షన్ కోసం.... ఇలా పలు రకాల కారణాల వల్ల ఏడుస్తారు. అయితే ఆ అవసరాలు తీరగానే వెంటనే ఏడుపు ఆపేస్తూ ఉంటారు. అలా కాకుండా అకారణంగా పిల్లలు ఏడుస్తూ ఉన్నారంటే వాళ్ల సమస్యను 'కాలిక్ పెయిన్'గా అనుమానించాలి. పొట్టలో నొప్పి, కడుపులో గ్యాస్ చేరుకోవడం, తల్లిపాలు పడకపోవటం, లాక్టోజ్ ఇన్‌టాలరెన్స్ వల్ల ఇది వస్తుంది. ఇలాంటి కాలిక్ పెయిన్‌తోపాటు విరోచనాలు, వాంతులు కూడా కనిపిస్తే వెంటనే వైద్యులకు చూపించాలి. పాల అలర్జీ ఉంటే తల్లి పాలు, పోత పాలు మానేసి వైద్యులు సూచించిన మిల్క్ పౌడర్ వాడాలి. ఈ స్థితి కొన్ని నెలలపాటు వేధించి సర్దుకుంటుంది. అరుదుగా కొందరిలో కొన్నేళ్లపాటు కొనసాగుతుంది. ఏదేమైనా పసికందులు ఆపకుండా ఏడుస్తూ ఉంటే పిల్లల వైద్యులను సంప్రతించటం అన్ని విధాలా శ్రేయస్కరం.

# వేసవిలో పిల్లలు చల్లగా!

**డాక్టర్! మా పాపకు నాలుగు నెలలు. ఎండ వేడి నుంచి పాపను ఎలా కాపాడుకోవాలి? ఎండదెబ్బ తగలకుండా ఉండాలంటే ఏం చేయాలి? అసలు వేసవిలో పసిపిల్లలకు ఎలాంటి సమస్యలు వస్తాయి?**

వేసవిలో పసిపిల్లలను ఎంతో జాగ్రత్తగా కాపాడుకోవాలి. పిల్లల చర్మం చాలా సున్నితం కాబట్టి, శరీరంలో నుంచి నీరు త్వరత్వరగా ఆవిరవుతూ ఉంటుంది. దాంతో పిల్లలు డీహైడ్రేషన్‌కు గురవుతూ ఉంటారు. శరీరం వేడెక్కిపోతుంది. కొంతమంది పిల్లలకు తల్లి పాలు సరిపోకపోవచ్చు. దాంతో బరువు కోల్పోతారు. ఈ కాలంలో పిల్లలు తమ శరీర బరువులో 10% కోల్పోతారు. అయితే బరువు 20% కంటే తగ్గితే ఆ ప్రభావం మూత్రపిండాల మీద పడుతుంది. శరీరంలో ఎలక్ట్రలైట్లలో తరుగుదల ఏర్పడుతుంది. సోడియం ఎక్కువై, మూత్రపిండాల సమస్యలు మొదలవుతాయి. ఇలా జరగకుండా ఉండాలంటే తల్లులు



వైద్యుల సూచనల మేరకు పాల ఉత్పత్తి పెరిగేటట్టు మందులు వాడాలి, లేదా పాలకు ప్రత్యామ్నాయాలు పిల్లలకు వాడాలి. అయితే పిల్లలకు పాలు సరిపోతున్నాయో, లేదో గుర్తించాలంటే కొన్ని లక్షణాలను గమనించాలి. పిల్లలు 20%కి మించి బరువు తగ్గినా, ఎక్కువగా ఏడుస్తున్నా, తల్లి దగ్గర పాలు తాగిన తర్వాత కూడా ఏడుస్తున్నా, రోజుకి 7, 8 సార్ల కంటే తక్కువసార్లు మూత్రవిసర్జన చేస్తున్నా... ఆ పిల్లలు తల్లి పాలు సరిపోక డీహైడ్రేషన్‌కు గురయ్యారని గ్రహించాలి. అలాగే కొంతమంది పిల్లల్లో కామెర్లు కూడా కనిపిస్తాయి. ఇలాంటప్పుడు పిల్లలకు తల్లిపాలతో పాటు పోత పాలు కూడా తాగించాల్సి ఉంటుంది. ఈ జాగ్రత్తలతోపాటు ఇంట్లో చల్లని వాతావరణాన్ని సృష్టించాలి. ఏసిలు ఉంటే 28 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతకు సెట్ చేయాలి. ఏసి లేకపోతే తలుపులు, కిటికీలకు మ్యాట్స్, వట్టివేళ్ల చాపలు కట్టాలి. నీళ్లు నింపిన బక్కెట్లు గదిలో ఉంచాలి.

# ఎప్పుడు, ఏం తినాలి?

**ఆకలేసినప్పుడు, వీలు కుదిరినప్పుడు తింటూ ఉంటాం! కానీ అల్పాహారానికైనా, భోజనానికైనా నియమిత సమయాలు పాటించాలి. అప్పుడే ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది.**



### ఉదయం అల్పాహారం

ఉదయం 7 నుంచి 8 గంటలలోపు తినేయాలి.

ఎటువంటి పరిస్థితుల్లోనూ 10 దాటిన తర్వాత అల్పాహారం తినకూడదు.

నిద్ర లేచిన అరగంటలోపే అల్పాహారం తీసుకోవాలి.

### మధ్యాహ్న భోజనం

12.30 నుంచి 2 గంటల్లోపు మధ్యాహ్న భోజనం ముగించాలి.

సాయంత్రం 4 తర్వాత తినకూడదు.

ఉదయం అల్పాహారానికి మధ్యాహ్న భోజనానికి మధ్య 4 గంటల విరామం మాత్రమే ఉండాలి.

### రాత్రి భోజనం

6 నుంచి 9 గంటల మధ్య ముగించాలి.

రాత్రి 10 దాటిన తర్వాత తినకూడదు.

## ఫిట్‌నెస్ కోసం

# డ్యాన్స్

వేడుకలు, సంతోషకరమైన సందర్భాల్లో మాత్రమే నలుగురు కలిసి చిందేయడం సహజం! కానీ ఇప్పుడు నిత్యం డ్యాన్స్ మంత్రాన్ని జపిస్తోంది నగర యువత. అదే మంటే అదొక ఫిట్‌నెస్ మంత్రగా చెబుతున్నారు. ఇల్లు, కార్యాలయం..పబ్‌లలో సైతం నృత్యంతో కసరత్తు చేస్తున్నారు. యోగా, జిమ్, జాగింగ్, వాకింగ్ లాగే ఇప్పుడు నృత్యం కూడా వ్యాయామ క్రియగా మారిపోయింది.

అబ్బాయిలు కండలు పెంచడానికి, అమ్మాయిలు అందమైన శరీరాకృతిని సొంతం చేసుకునేందుకు చాలా వ్యాయామశాలలున్నా యి. ఎన్నో వ్యాయామ పద్ధతులూ ఉన్నాయి. కానీ జిమ్‌కెళ్లి బరువులు ఎత్తుతూ, అద్దంలో పదే పదే కండలు చూసుకుంటూ చేయ డం బోరింగ్‌గా ఫీలయ్యే వారు...! పార్కులో రోజూ ఏం నడుస్తాం! అను కునేవారికి ఇప్పుడు డ్యాన్స్ ఫిట్‌నెస్ ఒక మంచి అవకాశంగా కనప డుతోంది. వ్యాయామం చేయాలనుకునేవారు, డ్యాన్స్‌ను ఇష్టపడేవారు ఎక్కువగా డ్యాన్స్ వ్యాయామాన్ని కోరుకుం టున్నారు. వాస్తవానికి ఈ పద్ధతి వ్యాయామం ఆరేళ్ల నుంచి పరిచయమైనా, ఇటీవల నగర యువత నోళ్లలో నానుతోం ది. కార్పొరేట్ ఉద్యోగులు, యువత, కుర్ర కారు డ్యాన్స్ వర్కవుట్లపై మక్కువ చూపుతున్నారు. సహజంగా యూత్ ట్రెండ్లన్నీ పాశ్చాత్య దేశాలనుంచి దిగుమతి చేసు కుంటామనే అపోహ ఉంది! కానీ ఈ డ్యాన్స్ వ్యాయామం మాత్రం పూర్తి గా మన దేశంలో మొదలైన ట్రెండ్. ఢిల్లీ, ముంబయి వంటి నగరాల్లో మొదలై, బెంగళూరు, చెన్నై, పుణె, హైదరాబాద్ నగరాల యువతను ఉర్రూతలూగిస్తోం ది. దాంతో ఇప్పుడు వెస్ట్రన్ డ్యాన్స్ ఇనిస్టి ట్యూట్లన్నీ డ్యాన్స్ వ్యాయామ కేంద్రాలుగా మారాయి. డ్యాన్స్ మాస్టర్స్ ఫిట్‌నెస్ కోచ్‌ల అవతారం దాల్చారు.



### ఆదాయవనరుగా..!

మ్యూజిక్, డ్యాన్స్ కలగలసిన నృత్య ఫిట్‌నెస్ నేర్పించే వారికి ఇప్పుడు మంచి డిమాండే ఉంది. సిని మా, టీవీ రంగాల్లో కొరియోగ్రాఫర్‌గా రాణించాలను కునే యువత ముఖ్యంగా డ్యాన్స్ ఫిట్‌నెస్ వర్కవుట్లు నేర్పించడాన్ని ప్రత్యేక ఆదాయ వనరుగా ఎంచుకుంటు న్నారు. డ్యాన్స్ వ్యాయమ కోచింగ్ సెంటర్లు నెలకు రూ1000 నుంచి రూ6000 వరకు ఫీజు వసూలుచేస్తున్నాయి. అవి నృత్య శిక్షకుడు, ప్రాంతం ఆధారంగా ఫీజు ఉంటుంది. నలుగురితో కలిసి డ్యాన్స్ చేయడం వల్ల, సరదాగానూ, ఉల్లాసంగానూ ఉండటంతో సాధారణ వ్యాయా మాన్ని ఇష్టపడనివారు సైతం, బృంద నృత్యవ్యాయామంపై ఆసక్తి చూపుతున్నారు.

### ఇవే డ్యాన్స్ వర్కవుట్లు

బాలీఫిట్‌నెస్, బోక్వా, మసాలా భాంగ్రా, బూట్ క్యాంప్, క్రాస్‌ఫిట్, జుంబా, ఎరోబిక్స్, సల్సా వంటి నృత్యరీతుల్ని ముఖ్యంగా ఫిట్‌నెస్ వర్కవుట్లుగా చేస్తున్నారు. వీటిలో ఒక్కో నృత్యం ఒక్కో రకంగా ఉంటుంది. పంజాబీ జానపద నృత్యం మసాలా భాంగ్రా. అధికబరువు తగ్గేందుకు, శరీరంలో ఎక్కువ కేలరీలు ఖర్చు అయేందుకు ఇది సరైన వ్యాయామంగా చెబుతున్నారు ఫిట్‌నెస్ నిపుణులు. శరీరాన్ని ఎల్, కే, ఓ ఆకారాలుగా వొంచుతూ చేసే వ్యాయామం బోక్వా. దీనిలో హోరెత్తే సంగీతంతోపాటు, దక్షిణాఫ్రికా నృత్య భంగిమలు ఉంటాయి. శరీర భాగాల్లో అసహజంగా పేరుకుపోయిన కొవ్వును కరిగించేందుకు బోక్వా ఉపకరిస్తుంది. వ్యాయామం శరీర, మానసిక ఆరోగ్యానికి చాలా మంచిది. కానీ ఆ వ్యాయామ శిక్షణ సరైన నిపుణుల వద్ద తీసుకోవాలి.



## పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ ముమ్మాటికీ నిజం


### మెగాస్టార్ వ్యాఖ్యలతో విభేదించిన గాయని చన్మయి శ్రీపాద

చిత్రపరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్‌లాంటివి ఉండవని చిరంజీవి చేసిన కామెంట్స్‌తో గాయని చన్మయి శ్రీపాద విభేదించారు. ఇవి లేకుండా సినీ పరిశ్రమ లేదని ఖరాఖండిగా చెప్పారు. సినిమాలో అవకాశం కావాటంలే..లొంగిపోవాలన్నది నిజమని చెప్పారు. పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ ఉందని ఆమె అన్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఎక్స్ వేదికగా ఓ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. ఇండస్ట్రీలో నిబద్ధత అనే పదానికి పూర్తి భిన్నమైన అర్థం ఉందని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. సినీ పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ సమస్య ఎక్కువగా ఉంది. కమిట్‌మెంట్ ఇవ్వకపోతే కొత్త వారికి అవకాశాలు రావు. సాధారణంగా కమిట్‌మెంట్ అంటే వృత్తిపరమైన నిబద్ధత అనే అర్థం. కానీ, ఇండస్ట్రీలో మాత్రం దాని అర్థం వేరు. కొందరు పురుషులు ఈ పదాన్ని ఉపయోగించి మహిళల నుంచి ఏవేవో ఆశిస్తారు. గతంలో ఓ ప్రముఖ సింగర్ ఇండస్ట్రీలో ఎదురైన చేదు అనుభవాలకు భయపడి ఈ రంగాన్నే వదిలివెళ్లిపోయింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంతోమంది ఇక్కడ వేదికలపై స్పీచ్‌లు ఇస్తూనే ఉన్నారని చిన్మయి తెలిపారు. తాను కూడా గతంలో లైంగిక వేధింపులు ఎదుర్కొన్నట్లు చెప్పారు. తన తల్లి సమక్షంలోనే ఎంతో నమ్మిన ఒక పెద్దాయన తనతో తప్పుగా ప్రవర్తించాడని అసహనం వ్యక్తం చేశారు. చిరంజీవి ఓ లెజెండ్ అని ఆమె అన్నారు. ఆయన తరంలో నటీనటులలంతా ఒకరితో ఒకరు స్నేహభావంతో ఉండేవారని.. పరస్పరం గౌరవించుకునే వారని చెప్పారు. లెజెండ్‌లతో కలిసి వర్క్ చేసిన వారు కూడా తన దృష్టిలో గొప్పవారేనని చిన్మయి తెలిపారు. ఇటీవల 'మన శంకరవరప్రసాద్ గారు' సక్సెస్ మీట్‌లో చిరంజీవి ఇండస్ట్రీ గురించి మాట్లాడారు. 'సినీ ఇండస్ట్రీ అద్దం లాంటిది. మనం ఎలా ఉంటామో అలాంటి ఫలితమే వస్తుంది. ఎవరైనా సరే సినీ ఇండస్ట్రీలోకి వస్తానంటే వారిని ప్రోత్సహించాలి. ఇది గొప్ప ఇండస్ట్రీ. 'ఇక్కడ నెగెటివ్ పీపుల్ ఉంటారు. చేదు అనుభవాలు ఎదురవుతాయి' అనుకుంటే అది నీ తప్పిదం. నువ్వు నిక్కచ్చిగా ఉంటే ఎవరూ అవకాశం తీసుకోరు. క్యాస్టింగ్ కౌచ్‌లాంటివి ఉండవు . నువ్వు ప్రొఫెషనల్‌గా ఉండాలి. కొత్త టాలెంట్‌కు ఎప్పుడూ ప్రోత్సాహం లభిస్తూనే ఉంటుంది' అని ఆయన అన్నారు. అయితే చిరంజీవి వ్యాఖ్యలతో చిన్మయి విభేదించారు.

## జననాయగన్‌కు చుక్కెదురు

### సింగిల్ బెంచ్ తీర్పును పక్కన పెట్టిన హైకోర్టు

విజయ్ కథానాయకుడిగా హెచ్.వినోద్ దర్శకత్వంలో రూపొందిన 'జన నాయగన్'కు మరోసారి చుక్కెదురైంది. 'జన నాయగన్' యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని గతంలో సింగిల్ బెంచ్ తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ తీర్పును మద్రాసు హైకోర్టు



మంగళవారం పక్కనపెట్టింది. మరోసారి విచారణ జరిపి నిర్ణయం తీసుకోవాలని తిరిగి సింగిల్ బెంచ్‌ను ఆదేశించింది. సెన్సార్ బోర్డుకు తన వాదనలు వినిపించడానికి న్యాయపరమైన అవకాశాలు ఇవ్వాలని మద్రాసు హైకోర్టు పేర్కొంది. అలాగే, ఈ వ్యవహారాన్ని రివైజింగ్ కమిటీకి పంపిన నిర్ణయం సరైనదా కాదా.. అనే అంశాన్ని సింగిల్ జడ్జి స్వేచ్ఛగా పరిశీలించి నిర్ణయం తీసుకోవచ్చని హైకోర్టు పేర్కొంది. ఈ కేసుకు సంబంధించిన అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని తగినవిధంగా మరోసారి విచారణ చేసి ఆదేశాలు జారీ చేసే అధికారం సింగిల్ బెంచ్‌కు ఉందని హైకోర్టు స్పష్టం చేసింది. దీంతో ఈ సినిమా విడుదల మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. జన నాయగన్‌కు యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని సెన్సార్ బోర్డుకు జనవరి 9న మద్రాసు హైకోర్టు సింగిల్ బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ సీబీఎఫ్‌సీ మద్రాసు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. కేసు విచారణకు స్వీకరించిన న్యాయస్థానం.. సెన్సార్ సర్టిఫికెట్ జారీపై తాత్కాలిక స్టే విధించింది. ఈ స్టేను సవాలు చేస్తూ నిర్మాణ సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీని విడుదల విషయంలో జోక్యానికి నిరాకరించిన అత్యున్నత న్యాయస్థానం మద్రాసు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించాలని నిర్మాతలకు సూచించింది.




## అనసూయ అంటే అంత అభిమానమా? నిజంగా గుడి కడతాడా?

టాలీవుడ్ నటి, ప్రముఖ యాంకర్ అనసూయ భరద్వాజ్ పేరు కొంతకాలంగా తరచూ వార్తల్లో వినిపిస్తోంది. నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలతో మొదలైన వివాదం.. అనసూయ ఇచ్చిన స్ట్రాంగ్ కౌంటర్.. ఆ తర్వాత సోషల్ మీడియాలో ట్రోలింగ్.. ఇవన్నీ కలిసి ఆ వ్యవహారం హాట్ టాపిక్ గా మారింది. ఈ నేపథ్యంలో తాజాగా మరో సంచలన ప్రకటన వెలుగులోకి వచ్చింది. అనసూయ కోసం గుడి కడతామంటూ ఆమె అభిమాని మురళీ శర్మ ప్రకటించడం ఇప్పుడు పెద్ద చర్చకు దారితీస్తోంది. అనసూయ అభిమాన సంఘం అధ్యక్షుడినని చెప్పుకుంటూ మురళీ శర్మ రీసెంట్ గా మీడియాలో హైలెట్ అయ్యారు. అనసూయకు మద్దతుగా ఆయన చేసిన వ్యాఖ్యలు అప్పట్లో వైరల్? గా మారాయి. ఇప్పుడు వరుస ఇంటర్వ్యూలతో ట్రెండింగ్ లో ఉంటున్నారు. తాజాగా ఓ యూట్యూబ్ ఛానల్? కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మురళీ శర్మ.. తమిళనాడులో నటి ఖుష్బూకు గుడి ఉన్నట్టు, సమంతకు గుడి ఉన్నట్టు, యాంకర్ అనసూయకు గుడి కడతామని వెల్లడించారు. అభిమానులందరూ కలిసి ఒక నిర్ణయానికి వచ్చిన తర్వాత ఎక్కడ ఆలయం నిర్మించాలనే విషయంపై తేలుస్తామని చెప్పారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం కూడా సహకరించాలని కోరారు. అనసూయ గారి అనుమతి తీసుకుని, ఆమె అంగీకరిస్తేనే ఆలయ నిర్మాణం ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. అనసూయ అంటే తనకు అపారమైన గౌరవమని, ఆమె చేసిన కౌంటర్? కు పూర్తిగా మద్దతు ఇస్తున్నానని చెప్పా రు. అభిమానులందరూ కలిసి అనసూయకు గుడి కడతామని.. అక్కడ పూజారులు ఉండాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రేమతో ఒక గులాబీ పెట్టినా చాలు అంటూ తనదైన శైలిలో వ్యాఖ్యానించారు. దీంతో మురళీ శర్మ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ అవుతున్నాయి. కొంతమంది అభిమానులు మద్దతు తెలుపుతుంటే.. మరి కొందరు నెటిజన్లు మాత్రం గుడి నిర్మాణ ప్రకటనపై సెటైర్లు వేస్తున్నారు. నిజంగా గుడి కడతారా? ఎక్కడ కడతారు? ఎప్పుడు కడతారు? అనే ప్రశ్నలతో నెటిజన్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆ విషయం మరిన్ని మలుపులు తిరిగేలా కనిపిస్తోంది. ఇక అనసూయ విషయా నికొస్తే.. జబర్దస్త్ ద్వారా యాంకర్ గా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సొంతం చేసుకున్నారు. ఒకవైపు యాంకర్ గా వ్యవహరిస్తూనే.. మరొకవైపు సినిమాల్లో కూడా నటించిన ఆమె.. ఆ పాత్రలతో ఊహించని క్రేజ్ సొంతం చేసుకున్నారు. అదే సమయంలో సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్ గా ఉంటూ గ్లామర్ ఫోటోలతో ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాకుండా ఎప్పటికప్పుడు పలు విషయాలపై స్పందిస్తుంటారు. ఇప్పుడు తన గుడి కొడతామన్న ప్రకటనపై రెస్పాండ్ అవుతారో లేదో వేచి చూడాలి.



## ఫిబ్రవరి 6న జననాయగన్



ఇళయ దళపతి విజరు జోసెఫ్ నటించిన సినిమా 'జన నాయగన్‌పై అభిమానుల్లో అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. హెచ్‌వినోద్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా, బాలకృష్ణ నటించిన 'భగవంత్ కేసరి'కి కొంచెం అడ్వాన్స్ వెర్షన్‌గా ఉండబోతుందనే టాక్ ఇప్పటికే సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమాకు సెన్సార్ బోర్డు యు/ఎ సర్టిఫికెట్ ఇవ్వాలన్న సింగిల్ బెంచ్ తీర్పును మద్రాస్ హైకోర్టు చీఫ్ జస్టిస్ బెంచ్ రద్దు చేసింది. ఈ విషయాన్ని మళ్లీ అక్కడే తేల్చుకోవాలని మేకర్స్‌ను ఆదేశించింది. జన నాయకుడుకు యు/ఎ సర్టిఫికెట్ ఇచ్చి వెనక్కి తీసుకోవడంపై మేకర్స్ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో సర్టిఫికెట్ జారీ చేయాలని సింగిల్ బెంచ్ సెంట్రల్ బోర్డ్ ఆఫ్‌ఫిల్మ్‌సర్టిఫికేషన్ (సిబిఎఫ్‌సి) స్పష్టం చేసింది. దీనిపై బోర్డు అప్పీల్ చేసింది. ఇప్పటికే చిత్ర యూనిట్ ఈ సినిమా విడుదలకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తోంది. ఫిబ్రవరి 6న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదలయ్యే అవకాశాలు ఉన్నట్లుగా ఇండిస్ట్రీలో చర్చ జరుగు తోంది. ఈ సినిమాలో పూజా హెగ్డే కథానాయిక. మమితా బైజు విజరు కుమార్తె పాత్రలో కీలకంగా కనిపించనున్నారు. విలన్ పాత్రలో బాబీ డియోల్ నటించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతాన్ని ఇచ్చారు. కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఈ సినిమా తెరకెక్కింది. తమిళంతో పాటు తెలుగు, హిందీ భాషల్లో కూడా ఈ సినిమా విడుదల చేయ నున్నట్లుగా నిర్మాతలు ప్రకటించారు.

## ఈ ఏడాది మిల్కీ బ్యూటీకి కలిసొచ్చేలా ఉందే!

మిల్కీ బ్యూటీ తమన్నా గత కొంతకాలంగా సరైన అవకాశం లభించక ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా స్పెషల్ సాంగ్ లు చేస్తూ వాటికే పరిమితం అయిపోతుందేమో అనే అనుమానాలు కూడా వ్యక్తం అయ్యేలా చేసింది .ఇక ఇప్పుడు తాజాగా తన రూట్ మార్చుకుంది ఈ ముద్దుగుమ్మ. అందులో భాగంగానే ఒక్కో అడుగు వేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటూ మళ్లీ తిరిగి తన పూర్వ వైభవాన్ని దక్కించుకునే ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగానే తాజాగా కోలీవుడ్ లో సుందర్ సి దర్శకత్వంలో విశాల్ హీరోగా వస్తున్న 'పురుషన్' అనే సినిమాలో హీరోయిన్ గా నటిస్తోంది. ఈ చిత్రాన్ని తెలుగులో 'మొగుడు' అంటూ రిలీజ్ చేయబోతున్నారు. ఈ సినిమా నుండి విడుదల చేసిన టీజర్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. అయితే ఇప్పుడు సౌత్ లోనే కాకుండా నార్త్ లో కూడా ఏకంగా ఇద్దరు స్టార్ హీరోల చిత్రంలో అవకాశం దక్కించుకున్నట్లు సమాచారం. తాజాగా బాలీవుడ్ మీడియా కథనాల నుండి వెలువడుతున్న సమాచారం ప్రకారం.. ప్రముఖ బాలీవుడ్ స్టార్ హీరోలైన సంజయ్ దత్, అజయ్ దేవగన్ కాంబినేషన్లో వస్తున్న 'రేంజర్' అనే సినిమాలో తమన్నా అవకాశం దక్కించుకుంది. ఈ సినిమా పూర్తిస్థాయి యాక్షన్ ఎంటర్టైనర్ గా హై వోల్టేజ్ సన్నివేశాలతో ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సమాచారం. ఈ చిత్రాన్ని దర్శకుడు లవ్ రంజన్ నిర్మిస్తున్నారు. తమన్న పాత్ర శక్తివంతంగా అటు నటనకు ప్రాధాన్యత ఉండే పాత్ర కావడంతో ఈ సినిమాపై అంచనాలు పెరుగుతున్నాయి. యాక్షన్ ఓరియంటెడ్ మూవీ గా వస్తున్న ఈ చిత్రంలో స్టార్ తారాగణం భాగమవుతుండడంతో రేంజర్ ఇప్పటికే అందరి దృష్టిని ఆకట్టుకుంది. మరి ఇలాంటిలో సినిమాలో అవకాశం దక్కించుకోవడంతో తమన్నా తిరిగి పూర్వ వైభవాన్ని అందుకుంటుందా అనే కామెంట్లు వ్యక్తం అవుతున్నాయి. ఒకప్పుడు స్టార్ హీరోయిన్గా ఇండస్ట్రీని ఒక ఊపు ఊపిన ఈమె.. ఇప్పుడు మళ్లీ ఆ స్టార్ స్టేటస్ కోసం తెగ ప్రయత్నాలు చేస్తోంది. మరి ఈ సినిమాతో తమన్నా తన పూర్వ వైభవాన్ని తిరిగి దక్కించుకుంటుందో లేదో చూడాలి. తమన్నా విషయానికి వస్తే.. 2005లో చాంద్ షా రోషన్ చెహ్రా సినిమా ద్వారా ఇండస్ట్రీకి పరిచయమైంది. అయితే ఈ సినిమా డిజాస్టర్ గా నిలిచింది. ఆ తర్వాత కొన్ని ఆల్బమ్ సాంగ్స్ లో కనిపించిన ఈమె.. 2006లో శ్రీ అనే సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. అదే ఏడాది కేడీ సినిమాతో తమిళ సినీ రంగంలోకి కూడా అడుగుపెట్టింది. 2007లో వచ్చిన హ్యాపీడేస్ చిత్రంతో తన కెరీర్ లో మళ్లీ వెనుతిరిగి చూసుకోలేదు.. అలా వరుసగా రామ్ చరణ్, అల్లు అర్జున్ , ప్రభాస్ , ఎన్టీఆర్ వంటి స్టార్ హీరోలతో జతకట్టి స్టార్ హీరోయిన్గా పేరు దక్కించుకుంది. అంతేకాదు ఒకానొక సమయంలో అత్యధిక రెమ్యూనరేషన్ తీసుకున్న హీరోయిన్గా కూడా గుర్తింపు దక్కించుకుంది. అయితే ఈ మధ్యకాలంలో స్పెషల్ సాంగ్ లలో అలరిస్తున్న తమన్న మళ్లీ హీరోయిన్గా ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమయ్యింది.



## నీలి రంగు గౌనులో ఈషా గ్లామర్ హీట్.. స్టన్నింగ్!

బాలీవుడ్ గ్లామరస్ బ్యూటీ ఈషా గుప్తా మరోసారి ఇంటర్నెట్ ను షేక్ చేస్తోంది. పారిస్ వేదికగా జరిగిన ఓ ప్రముఖ ఫ్యాషన్ ఈవెంట్ లో ఆమె ధరించిన దుస్తులు ఇప్పుడు టాక్ ఆఫ్ ది టౌన్ గా మారాయి. లేత నీలం రంగు ఆఫ్ షోల్డర్ గౌనులో ఈషా గుప్తా అచ్చం దేవకన్యలా మెరిసిపోతోంది. డీప్ నెక్ లైన్ తో డిజైన్ చేసిన ఈ గౌనులో ఆమె తన గ్లామర్ తో స్టన్ అయ్యేలా దర్శనమిచ్చింది. ముఖ్యంగా ఆ డ్రెస్ కింది భాగంలో ఉన్న వెండి రంగు ఎంబ్రాయిడరీ వర్క్ ఆమె లుక్ కు రాయల్ టచ్ ఇచ్చింది. ఈ లుక్ లో ఈషా మేకప్, హెయిర్ స్టైల్ ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. పాతకాలపు హాలీవుడ్ హీరోయిన్ల తరహాలో షార్ట్ వేవీ హెయిర్ స్టైల్ తో ఆమె చాలా క్లాసీగా కనిపిస్తోంది. ముదురు ఎరుపు రంగు లిప్ స్టిక్ చెవులకు చిన్న డైమండ్ ఇయర్ రింగ్స్ ధరించి ఎంతో హుందాగా తయారైంది. బాల్కనీలో నిల్చుని ఆమె ఇచ్చిన ఫోజులు, ఆ కిల్లర్ ఎక్స్ ప్రెషన్స్ కుర్రాళ్ళ గుండెల్లో మంటలు పుట్టిస్తున్నాయి. ఇక ఈషా గుప్తా కెరీర్ విషయానికి వస్తే.. 'జన్నత్ 2' సినిమాతో బాలీవుడ్ లోకి అడుగుపెట్టింది. తొలి సినిమాతోనే తన గ్లామర్ తో, నటనతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత 'రుస్తుం', 'బాద్ షాహో', 'టోటల్ ధమాల్' వంటి చిత్రాల్లో నటించి మెప్పించింది. కేవలం నటిగానే కాకుండా, తన బోల్డ్ నెస్ తో ఇండస్ట్రీలో ప్రత్యేకమైన ఇమేజ్ క్రియేట్ చేసుకుంది. మిస్ ఇండియా ఇంటర్నేషనల్ టైటిల్ గెలుచుకున్న ఈ భామ, వెండితెరపై కూడా అదే స్థాయి అందాన్ని ఆరబోస్తూ దూసుకుపోయింది. తెలుగు ప్రేక్షకులకు కూడా ఈషా సుపరిచితురాలే. రామ్ చరణ్ నటించిన 'వినయ విధేయ రామ' సినిమాలో "ఏక్ బార్.. ఏక్ బార్" అంటూ సాగే స్పెషల్ సాంగ్ లో చిందేసి మాస్ ఆడియెన్స్ ను ఉర్రూతలూగించింది. అలాగే 'ఆశ్రమ్' వెబ్ సిరీస్ లో ఆమె చేసిన సోనియా పాత్రకు మంచి క్రేజ్ వచ్చింది. అందులో ఆమె చూపించిన బోల్డ్ పర్ఫార్మెన్స్ కు విమర్శకుల ప్రశంసలు కూడా దక్కాయి. వెండితెరపై అవకాశాలు కాస్త తగ్గినా, వెబ్ సిరీస్ లలో మాత్రం ఈ అమ్మడు దుమ్మురేపుతోంది. ప్రస్తుతం సినిమాల పరంగా స్పీడ్ తగ్గించినప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం ఈషా గుప్తా హవా ఏమాత్రం తగ్గలేదు. నిత్యం ఇలాంటి ఫొటోషూట్స్ తో, ఫ్యాషన్ ఈవెంట్స్ తో వార్తల్లో నిలుస్తూనే ఉంది. తన ఫిట్ నెస్ వీడియోలతో, యోగా పోజులతో నెటిజన్లకు ఇన్స్పిరేషన్ గా నిలుస్తోంది. సరైన అవకాశం వస్తే మరోసారి వెండితెరపై సత్తా చాటాలని చూస్తోంది. ఈ లేటెస్ట్ పారిస్ లుక్ చూస్తుంటే ఇంటర్నేషనల్ మోడల్స్ కు ఏమాత్రం తీసిపోని విధంగా ఆమె గ్లామర్ ఉంది.

## ఎన్టీఆర్ అభిమానులకు పండగవార్త

### మేలో దేవర-2 షూటింగ్ మొదలు

ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'దేవర'కు సీక్వెల్‌పై అప్డేట్ వచ్చింది. 2024లో ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా మంచి ఆదరణను సొంతం చేసుకుంది. దీనికి సీక్వెల్ ఉన్నట్లు గతంలోనే ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత దీనిపై పెద్దగా అప్‌డేట్స్ రాకపోవడంతో నెట్టింట రకరకాల వార్తలు ప్రచారమయ్యాయి. తాజాగా ఈ సినిమా నిర్మాత సుధాకర్ ఓ కార్యక్రమంలో 'దేవర 2'అప్‌డేట్ పంచుకున్నారు. ఈ ఏడాది మేలో దీని సీక్వెల్ పనులు ప్రారంభం కానున్నట్లు చెప్పారు. వచ్చే ఏడాదిలో సినిమాను విడుదల చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. దీంతో అభిమానులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. 'దేవర' విడుదలై ఏడాదైన సందర్భంగా గతేడాది సెప్టెంబర్‌లో నిర్మాణసంస్థ ఈ సీక్వెల్‌పై ఓ పోస్ట్ పెట్టింది. 'ప్రపంచం ఎప్పటికీ గుర్తుపెట్టుకునే పేరు ఇది. తాను పంచిన ప్రేమ, తాను చూపిన భయం.. ఎప్పటికీ మర్చిపోలేరు. 'దేవర 2' కోసం అందరూ సిద్ధంగా ఉండండి' అని పేర్కొంది.




'దేవర 2'పై కొరటాల గతంలో కొన్ని ఇంటర్వ్యూల్లో మాట్లాడి అంచనాలు పెంచేశారు. మొదటిభాగం కంటే రెండో భాగం చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుందని ఆయన వెల్లడించారు. పార్ట్-1లో చూసింది 10 శాతమేనని.. రెండో భాగంలో 100శాతం చూస్తారన్నారు. ప్రతీ పాత్రలో ట్విస్ట్ ఉంటుందని చెప్పారు

## ఉస్తాద్ భగత్ సింగ్ నుంచి క్రేజీ అప్‌డేట్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మాస్ ఎంటర్‌టైనర్ 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం నుంచి ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమా డబ్బింగ్ పనులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర యూనిట్ సోషల్ మీడియాలో ఒక ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. 'గబ్బర్ సింగ్' వంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత పవన్ కళ్యాణ్ , హరీష్ శంకర్ దేవిశ్రీ ప్రసాద్ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ముఖ్యంగా హరీష్ శంకర్ రాసిన పవర్‌ఫుల్ డైలాగులకు పవన్ తనదైన శైలిలో గొంతును అందించబోతుండటం హైలైట్‌గా మారనుంది. ఇక తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రాన్ని మార్చి 26న విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు టాక్ నడుస్తుంది. వాస్తవానికి ఆ తేదీన విడుదల కావాల్సిన రామ్ చరణ్ 'పెద్ది' చిత్రం వాయిదా పడటంతో, ఆ స్థానాన్ని 'ఉస్తాద్ భగత్ సింగ్' భర్తీ చేయనున్నట్లు సమాచారం.



శ్రీలీల, రాశి ఖన్నా కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. 'ఈసారి పర్ఫార్మెన్స్ బద్ధలైపోద్ది' అంటూ ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ సినిమా రేంజ్‌ను చెప్పకనే చెప్పగా, ఇప్పుడు డబ్బింగ్ పనులు మొదలవ్వడం సినిమా విడుదలకు అడుగులు వేగంగా పడుతున్నాయనే సంకేతాలను ఇస్తోంది.

PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254,MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154